


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ

- రాజధాని అభివృద్ధి అంటే అన్ని జిల్లాల అభివృద్ధి
- మంత్రి నారాయణ ఉద్ఘాటన

6

# ఐదేళ్లలో రూ.60వేల కోట్లు!

- సాగునీటి ప్రాజెక్టులపై వెచ్చిస్తామన్న సీఎం
- సమర్థ నీటి నిర్వహణతోనే అభివృద్ధి సాధ్యం
- గత పాలకులు సాగు నీటి వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు..
- పట్టిసీమ వద్దన్నారు... పోలవరాన్ని నాశనం చేశారు
- హంద్రీ-నీవాతో సీమలో హర్షాతిరేకాలు
- సాగునీటి రంగంపై సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్

2



## అనుసంధానం ఆగదు!

- నదుల అనుసంధానాన్ని చేపట్టి తీరుతాం
- స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

2

## బెదిరింపులతో సంస్కరణలు ఆగవు

- స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు

2

## నేడు మాచర్లకు సీఎం చంద్రబాబు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరు

3

## ప్రగతి పథానికి ఉత్తరాంధ్ర-రాయలసీమ

- అభివృద్ధే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తి
- రెండేళ్లలో రూపురేఖలు మార్చే ప్రయత్నం
- రూ.7803 కోట్లను ప్రాధాన్యతా క్రమంలో ఖర్చు చేస్తాం
- గత పాలకులు నీటి వ్యవస్థలను దెబ్బ తీశారు
- వాళ్లు చేసిన తప్పులకు మేం ఫైన్లు కట్టాం
- సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సుదీర్ఘ ప్రసంగం

3

22 నుండి అక్టోబర్ 2 వరకు

## పాఠశాలలకు దసరా సెలవులు

- మంత్రి లోకేష్ వెల్లడి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పాఠశాలలకు ఈ నెల 22 నుండి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ నెల 22 నుండి ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరుతున్నారనే విషయాన్ని టీడీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వారి కోరిక మేరకు విద్యా శాఖ అధికారులతో చర్చించి సెలవులపై నిర్ణయం తీసుకున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.



## వైసీపీ హయాంలో పశువైద్యంపై అంతులేని నిర్లక్ష్యం



- ఐదేళ్లలో పశువైద్యుల నియామక భర్తీ ఊసే లేదు
- గతంలో 2017, 2018లో సీఎం చంద్రబాబు చొరవతో భర్తీ
- పశువైద్య విద్యార్థుల స్టైపండ్ పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే
- త్వరలోనే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ
- గ్రామాల్లో ఇబ్బంది లేకుండా వెటర్నరీ అసిస్టెంట్ల సేవలు
- శాసనసభలో మంత్రి అచ్చెన్నాయుడు

4

కూటమి పాలనలో..

## మరింత విస్తరించిన ఎన్టీఆర్ వైద్యసేవ

- భారీగా పెరిగిన లబ్ధిదారులు, వ్యయం
- మొదటి ఏడాది లబ్ధిదారుల్లో 7, వ్యయంలో 8 శాతం పెరుగుదల
- గత ప్రభుత్వం పెట్టిన రూ.2,221 కోట్ల బకాయిల చెల్లింపు
- నెట్‌వర్క్ ఆసుపత్రులపై నిఘా పటిష్టం
- శాసనసభలో వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఉచిత వైద్యసేవలపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన మంత్రి

2



## కొబ్బరి ఉత్పత్తులకు ప్రోత్సాహం

5

- రూ. 9.96 కోట్లతో రాజోలు నియోజకవర్గంలో కామన్ ఫెసిలిటీ సెంటర్
- విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు మూడు పారిశ్రామిక క్లస్టర్ల గుర్తింపు
- శాసనసభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఉల్లి రైతులకు అండ..

## హెక్టారుకు రూ.50 వేలు ఆర్థికసాయం

- సీఎం చంద్రబాబు నిర్ణయం
- వెల్లడించిన మంత్రి అచ్చెన్నాయుడు
- ఉల్లి, ఇతర రైతులకు అండగా ఉంటామని హామీ

5



శాసనసభ ముందుకుతెచ్చే

## బిల్లులకు కేబినెట్ ఓకే

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- అజెండాలోని 13 అంశాలకు మంత్రిమండలి ఆమోదం

3



4

రాయచోటిలో హంద్రీ-నీవా

## ఫేజ్-1 పనులు పూర్తి చేయండి

- సీఎం చంద్రబాబుకు మంత్రి మండిపల్లి వినతిపత్రం
- రూ.450 కోట్ల పనులకు హామీ ఇచ్చిన సీఎం



4

## టీడీపీలోకి ముగ్గురు ఎమ్మెల్సీలు

ముఖ్యమంత్రి సమక్షంలో చేరిన రాజశేఖర్, కల్యాణ చక్రవర్తి, పద్మశ్రీ

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు


## హైస్కూలుని దత్తత తీసుకున్న కేంద్రమంత్రి

- రామ్మోహన్‌నాయుడికి మంత్రి లోకేష్ అభినందనలు
- అందరం కలిసి విద్యావ్యవస్థను ఆదర్శంగా నిలుపుదామని పిలుపు

2

# ఐదేళ్లలో రూ.60వేల కోట్లు!

- సాగునీటి ప్రాజెక్టులపై వెచ్చిస్తామన్న సీఎం
- సమర్ధ నీటి నిర్వహణతోనే అభివృద్ధి సాధ్యం
- సాగు నీటి వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు..
- పట్టిసీమ వద్దన్నారు... పోలవరాన్ని నాశనం చేశారు
- హంద్రీ-నీవాతో సీమలో హర్షాతిరేకాలు
- సాగునీటి రంగంపై సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్



అమరావతి (చైతన్య రథం): సమర్ధ నీటి నిర్వహణతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో నీటి సమర్ధ నిర్వహణ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఏం చేసిందో వివరించారు. అలాగే భవిష్యత్తులో ఏమేం చేయబోతున్నామనేది ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇరిగేషన్ రంగానికి సంబంధించిన అంశంపై సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతోపాటు.. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగంలో ఆడిన డ్రామాలపై రూపొందించిన వీడియోను ముఖ్యమంత్రి సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఏపీలో 1.06 కోట్ల ఎకరాలకు నీటిని అందిస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. మొత్తం ఐదేళ్లలో రూ.60 వేల కోట్లను జలవనరుల శాఖకు ఖర్చు చేస్తాం. 94 శాతం రిజర్వాయర్లలో నీళ్లు నింపిన జలవనరుల శాఖకు అభినందనలు. 1040 టీఎంసీ నీళ్లు ప్రస్తుతం నిల్వ ఉన్నాయి. వాటర్ యూజర్స్ కమిటీలకు కూడా కూటమి అధికారంలోకి వచ్చాకే ఎన్నికలు నిర్వహించి ప్రతినిధుల్ని నియమించాం. రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచడానికి చర్యలు చేపట్టాం. ఈసారి 2.1శాతం వర్షపాతం తక్కువగా పడింది. అయినా నీటి నిర్వహణవల్ల గతంతో పోలిస్తే 1.5మీటర్లమేర భూగర్భ జలాలుపెరిగాయి. ప్రస్తుతం 8.43 మీటర్లమేర భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భంలో 697టీఎంసీ నీరు ప్రస్తుతం అందుబాటులో ఉంది. సమర్ధ నీటి నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులను నింపాలి. భూగర్భ జలాలను రీఛార్జి చేసుకోవాలి. నీటిని సమర్ధవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాట రాష్ట్రంలో ఉండదు. ఏపీని కరవురహిత రాష్ట్రంగా తయారు చేసే బాధ్యత కూటమి తీసుకుంటుంది" అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

### పట్టిసీమ వద్దన్నారు... పోలవరాన్ని నాశనం చేశారు

"రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. జూన్ 2కంటే ముందే 7 ముంపు మండలాలను కలపాలని ప్రధానిని కోరాను. పార్లమెంటు సమావేశానికంటే ముందు ముంపు మండలాలు కలుపుతూ ఆర్డినెన్సును తెచ్చాం. ఆ నిర్ణయంతోనే పోలవరం ప్రాజెక్టు ముందుకు వెళ్లింది. భూసేకరణ, కాంట్రాక్టుల వివాదాలు, కుడి కాలువలాంటి సమస్యలను దాటుకుని 2019నాటికి 72 శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశాం. స్పిల్‌వే, స్పిల్ ఛానల్, గేట్లు, కాఫర్ డ్యామ్ పనులు, కుడి కాలువ పనులు వందశాతం పూర్తి చేశాం. గతంలో రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మించాం. గత పాలకుల అసమర్థత వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకు పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక... మళ్లీ రూ.1000 కోట్లతో కొత్తగా మళ్లీ నిర్మిస్తున్నాం. 2025 డిసెంబరునాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పనుల్ని రూ.960 కోట్లతో చేపడుతున్నాం. దీనిని పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీళ్లిస్తాం. రూ.894 కోట్ల నిధులు నిర్వాసితులకు ఇచ్చాం. 2019-24 మధ్య పోలవరం ప్రాజెక్టులో చేసిన పనులు 3.84 శాతం మాత్రమే. 2021కి పూర్తి కావాల్సిన ప్రాజెక్టును 7 ఏళ్లు వెనక్కినెట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లింది మేమే. ఐదేళ్లపాటు పోలవరం పనులను పక్కన పెట్టేశారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే అవకాశం ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కింది. 2027డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తిచేసి నీళ్లిస్తాం. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 439టీఎంసీ నీటిని కృష్ణాడెల్టాకు తరలించాం. పొదుపు చేసిన నీటిని శ్రీశైలంనుంచి రాయలసీమ ప్రాంతానికి తరలించి నీరిచ్చాం. గత ప్రభుత్వం పట్టిసీమ ఎత్తిపోతలను వినియోగించలేదు. ప్రజా ధనంతో కట్టినపట్టిసీమను వాడకుండా వదిలేశారు. టీడీపీ ప్రభుత్వంలో పట్టిసీమ కట్టారని... దాని తాము వాడడంఏంటనే అహంభావంతో ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారు. రెండేళ్లపాటు అసలు నీటిని తరలించలేదు. మూడో ఏడాది కరువు వస్తే.. ఇంకా నీటిని విడుదల చేయకుంటే తంతారని పట్టిసీమ ప్రాజెక్టును వినియోగించారు.బేషజంతో ప్రభుత్వ ఆస్తులను వినియోగించకుండా ప్రజలను, రైతులను నష్టపరిచే ప్రయత్నం చేశారు.టీడీపీకి పేరు వస్తుందనే పట్టిసీమను ఐదేళ్లలో వినియోగించలేదు. ప్రజావేదికను కూల్చి విధ్వంసంతో మొదలుపెట్టి విధ్వంసంతోనే ఓడిపోయారు" అని చంద్రబాబు వైసీపీ పాలనను ఎండగట్టారు.

### హంద్రీ-నీవాతో సీమలో హర్షం

"1987లో ఎన్టీఆర్ సంకల్పించిన హంద్రీనీవా కాలువ ద్వారా 738 కిలోమీటర్ల నీటిని తరలించి చిట్టచివరి ప్రాంతానికి తీసుకెళ్లాం. వంద రోజుల్లోనే రూ.3800 కోట్లను మంజూరు చేసి 3850 క్యూసెక్కుల నీటిని పారిస్తున్నాం. పులివెందుల చెరువుకు కూడా నీటిని కూటమి ప్రభుత్వమే ఇస్తోంది. హంద్రీ-నీవాపై ఇప్పటి వరకూ రూ.13 వేల కోట్ల రూపాయల మేర ఖర్చు పెట్టాం. 40 టీఎంసీ మేర నీటిని తరలించుకోవచ్చు. 497 చెరువులను నింపే ప్రయత్నం చేస్తున్నాం. రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లలోనూ నీటిని నింపేలా ప్రణాళికలు చేసుకున్నాం. ఆగస్టు 30న కుప్పానికి నీళ్లిచ్చి జలహారతి ఇవ్వటంతో నా జన్మ సార్ధకమైంది. రాయలసీమ ప్రాంతంలో ఒకప్పుడు వేరుశనగ విత్తనాలు వేస్తే ఖర్చు కూడా రాని పరిస్థితి ఉండేది. నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నాం. అలాంటి ప్రాంతానికి నీటిని తరలించేలా చేశాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## బెదిరింపులతో సంస్కరణలు ఆగవు

### స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): విధ్వంస పార్టీలు బెదిరింపులకు దిగినంత మాత్రాన రాష్ట్రాభివృద్ధికి చేపట్టిన సంస్కరణలు ఆపేదిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా వైసీపీని హెచ్చరించారు. రాష్ట్రంలో నీటి సమర్ధ నిర్వహణ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానమిస్తూ.. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఏం చేసిందో వివరించారు. అందులో భాగంగానే -రాష్ట్రలోని మొత్తం ఇరిగేషన్ వ్యవస్థను అసమర్ధ విధానాలతో గత పాలకులు ఏవిధంగానాశనం చేశారో వీడియోని ప్రదర్శించి మరీ వివరించారు. వైసీపీ వైఖరిని తూర్పారబడుతూనే.. మెడికల్ కాలేజీలపైనా చంద్రబాబు ప్రస్తావించారు. "మెడికల్ కాలేజీలపై కూటమి తీసుకున్న నిర్ణయంవల్ల ఎవరికీ నష్టం జరగదు. గతంలో మెడికల్ కాలేజీలు పెట్టి పేమెంట్ కోటా పెట్టారు. ప్రభుత్వంలో మేనేజ్‌మెంట్ అన్నారు. పీపీపీకి ఇస్తే సమర్ధవంతంగా సేవలు అందుతాయి. అన్ని సీట్లు ఉంటాయి. నాణ్యత ఉంటుంది. పేదలకూ ఉచిత సేవలు అందుతాయి. హైవేలను పీపీపీ విధానంలో నిర్మించారు. అలాగని ఆ హైవేలను నిర్మించిన వారికి ఇచ్చేసినట్టా...? ఆ ఆస్తి ప్రభుత్వానిదే. ప్రభుత్వమే వాటి యజమాని. నిర్మాణం చేపట్టి... రోడ్లను నిర్వహించి.. గడువు ముగిసిన తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. మెడికల్ కళాశాలల విషయంలో దూరదృష్టితో ఆలోచించే నిర్ణయం తీసుకున్నాం. ఎవరు అడ్డంపడినా మంచి నిర్ణయాలను ఆపేది లేదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

## అనుసంధానం ఆగదు!

- నదుల అనుసంధానాన్ని చేపట్టి తీరుతాం
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


అమరావతి (చైతన్య రథం): దేశంలో తొలిసారిగా నదుల అనుసంధానానికి ఉపక్రమించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో నీటి సమర్ధ నిర్వహణ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "దేశంలో నదుల అనుసంధానం చేస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందని చెబితే సురేశ్ ప్రభు నేతృత్వంలో 'టాస్క్ ఫోర్స్ ఫర్ ఇంటర్ లింకింగ్ ఆఫ్ రివర్స్'ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రాల్లో ఇంటర్ లింకింగ్ ఆఫ్ రివర్స్ చేపడతారు. తర్వాత గంగా కావేరిని అనుసంధానించే ప్రక్రియ చేపట్టనున్నారు. అందుకే దేశంలో తొలిసారిగా నదుల అనుసంధానాన్ని చేపట్టిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెబుతున్నా. కృష్ణా-గోదావరి నదుల నుంచి ఈ సీజన్‌లో ఇప్పటికి వరకూ 3782 టీఎంసీ జలాలు సముద్రంలోకి వృథాగా పోయాయి. ఒక్క గోదావరి నుంచే 2882 టీఎంసీ జలాలు, కృష్ణానుంచి 892 టీఎంసీ జలాలు సముద్రంలో కలిసిపోయాయి. గోదావరినుంచి రోజూ 50 టీఎంసీ, కృష్ణాలో రోజూ 24 టీఎంసీ నీళ్లు సముద్రంలోకి పోతున్నాయి. ఈ ఏడాది మొత్తంగా గోదావరినుంచే 5 వేల టీఎంసీ జలాలు సముద్రంలో కలుస్తుందని అంచనా. ఇలాంటి సమయంలో 200 టీఎంసీ నీళ్లు గోదావరినుంచి బనకచర్లకు తీసుకెళ్తే... రాయలసీమ సస్యశ్యామలం అవుతుంది. అన్ని రాష్ట్రాలు అంతర్గతంగా తమ రాష్ట్రాల్లోని నదులు అనుసంధానం పూర్తి చేస్తే ప్రపంచానికే ఆహార ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. వంశధారలో వరద వస్తే పెన్నా నది ద్వారా సోమశిల, కండలేరులో నీటి నిల్వ చేసుకునేలా పరిస్థితి వస్తుంది. వంశదార- నాగావళి నదులను అనుసంధానిస్తాం. గోదావరి నుంచి కృష్ణా నీళ్లను పొదుపు చేసుకుని ఇతర ప్రాంతాలకు వాడుకోవచ్చు. కావాల్సింది జలాలు, విద్వేషాలు కాదని పొరుగు రాష్ట్రాలు అర్థం చేసుకోవాలి. సముద్రంలోకి పోతున్న జలాలు సద్వినియోగం చేసుకుంటే తెలుగు రాష్ట్రాలకే ప్రయోజనమని గ్రహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జలలు సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి సాధ్యం. ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టినా, సాగునీటి ప్రాజెక్టులు కట్టి నీళ్లిస్తేనే నాకు ఎక్కువ తృప్తి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

### భూగర్భమే పెద్ద జలాశయం

"భూగర్భాన్ని జలాశయంగా మార్చుకుని ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 202 గ్రామాల్లో 20 మీటర్లకంటే దిగువన నీరుంది. ప్రకాశం జిల్లాలోనూ అదే పరిస్థితి. ఏపీ రిమ్స్ పోర్టల్ ద్వారా. అవేర్ ద్వారా రియల్ టైమ్‌లో నీటి నిల్వలు ఇతర అంశాలపై సమాచారం సేకరిస్తున్నాం. సెన్సార్ల ద్వారా రిజర్వాయర్లలో నీటి నిల్వల్ని, రెయిన్ గేజ్‌లు ద్వారా వర్షపు నీరు, సాయిల్ మాయిశ్చర్‌లాంటి అంశాలను తెలుసుకుంటున్నాం. రిజర్వాయర్లు, ఫ్లడ్ మేనేజ్మెంట్, గ్రౌండ్ వాటర్‌తో రియల్ టైమ్‌లోనే సమర్ధ నీటి నిర్వహణ చేస్తున్నాం. సాగునీటికి, తాగునీటికి, పరిశ్రమలకు నీటి భద్రత కల్పిస్తే అభివృద్ధి సాధ్యం అవుతుంది.ఇది కియా కార్ల ఫ్యాక్టరీ విషయంలో నిజమైంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ప్రగతి పథానికి ఉత్తరాంధ్ర-రాయలసీమ

- అభివృద్ధే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తి
- రెండేళ్లలో రూపురేఖలు మార్చే ప్రయత్నం
- రూ.7803 కోట్లను ప్రాధాన్యతా క్రమంలో ఖర్చు చేస్తాం
- గత పాలకులు నీటి వ్యవస్థలను దెబ్బ తీశారు
- వాళ్లు చేసిన తప్పులకు మేం ఫైన్లు కట్టాం
- సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సుదీర్ఘ ప్రసంగం



అమరావతి (చైతన్య రథం): ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేసిన ప్రగతిపథాన నిలపడమే కూటమి ప్రభుత్వ సంకల్పంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. రాష్ట్రంలో నీటి సమర్థ నిర్వహణ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో జరిగినచర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఉత్తరాంధ్రలో రూ.185 కోట్లు ఖర్చు చేస్తే వంశధార ఫేజ్-2 స్టేజ్ 2 పనులు పూర్తవుతాయి. తోటపల్లి తారకరామ తీర్థసాగర్, మహేంద్ర తనయ, హిర మండలం, వంశధార-నాగావళి మద్దువలస, నాగావళి-చంపావతి, జంఝావతి, గండిగెడ్డ ప్రాజెక్టులకు రూ.2097కోట్లు వ్యయమవుతుంది. కొత్త ఆయకట్టు 1.25 లక్షల ఎకరాలకు నీరివ్వటంతోపాటు ఇప్పటికే ఉన్న 2 లక్షల ఎకరాలు స్థిరీకరణ జరుగుతుంది. రెండేళ్లలో వీటిని పూర్తి చేసి ఉత్తరాంధ్రకు న్యాయం చేస్తాం. రాయలసీమలో అప్పర్ పెన్నా, పేరూరు రిజర్వాయర్, భైరవానితిప్ప హంద్రీనీవానుంచి మడకశిర బ్రాంచ్‌కెనాల్, అడవిపల్లి రిజర్వాయర్, నీవా బ్రాంచ్ కెనాల్, కళ్యాణి డ్యామ్‌తో పాటు గాలేరు నగరి ద్వారా కడప... రాజంపేట వరకూ నీళ్ల తీసుకెళ్తాం. మొత్తం రూ.7803 కోట్లను ప్రాధాన్యతా క్రమంలో ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాయలసీమకు నీళ్లిచ్చి రతనాలసీమగా మారుస్తాం" అని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

### గత పాలకులు నీటి వ్యవస్థలను దెబ్బ తీశారు

"ఎత్తిపోతల ప్రాజెక్టులను ధ్వంసం చేసింది గత ప్రభుత్వం. 613 స్కీములు డిఫెక్ట్ అయ్యాయి. 6.5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే పరిస్థితివున్నా ఇవ్వలేకపోయింది. ఎత్తిపోతల ప్రాజెక్టుల కింద 8.3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలోనే 2.97 లక్షల ఎకరాలు స్థిరీకరించాం. రూ.725 కోట్లు వ్యయం చేసి ఎత్తిపోతల ప్రాజెక్టులను ఈ ఏడాదే ఆపరేషన్‌లోకి తీసుకువచ్చి నీళ్లిస్తాం. 2019-24 మధ్య సాగునీటిరంగాన్ని ధ్వంసం చేశారు. కాలువలు, వరదగట్లు దెబ్బతిన్నాయి. ఫించ, అన్నమయ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయినా గత ప్రభుత్వం బాధితుల్ని పరామర్శించ లేదు. గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోయింది. ఆ గేటును కూడా పెట్టలేకపోయారు. ప్రాజెక్టులను నిర్మించటం ఎంత ముఖ్యమో దాన్ని నిర్వహించటం కూడా అంతే ముఖ్యం. డ్యాములు, గేట్ల నిర్వహణకు ఓ మాన్యువల్ తయారు చేశాం. దాని ప్రకారమే ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాం. కానీ గత పాలకులు ఐదేళ్లు దాన్ని పక్కన పెట్టేశారు. ప్రాజెక్టులను ధ్వంసం చేశారు. తుంగభద్ర గేట్లు దెబ్బతిన్నాయి. దానిని పునరుద్ధరిస్తున్నాం. శ్రీశైలం డ్యామ్‌లో స్పిల్ వే ప్రొటెక్షన్ కోసం రూ.204 కోట్లు, ధవళేశ్వరం బ్యారేజీ కోసం రూ.150 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గుండ్లకమ్మ గేట్లు పూర్తి చేశాం. సోమశిల ప్రాజెక్టులో మరమ్మతులు కూడా వచ్చే సీజన్ నాటికి పూర్తిచేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

### వాళ్లు చేసిన తప్పులకు మేం ఫైన్లు కట్టాం

"విధ్వంసమైన రాజకీయాలు చేస్తూ ప్రాజెక్టులకు అడ్డం పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతగా ప్రవర్తించాలి. చిత్తూరు జిల్లాలో త్రీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామని రూ.2144 కోట్ల అంచనాతో ప్రాజెక్టు టేకప్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించారని... ఎన్జీటీ జరిమానా వేసింది. వాళ్లు చేసిన తప్పుకు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి రూ.25 కోట్లు జరిమానా కట్టాల్సి వచ్చింది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును గత ప్రభుత్వం చేపట్టింది. ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవంటూ ఎన్జీటీ పనులు నిలిపేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టు కోసం రూ.923 కోట్లు ఖర్చు పెట్టారు. వెలిగొండలో పనులు అసంపూర్తిగా ఉండగానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్టు డ్రామాలు ఆడారు. మేం దాన్ని పూర్తిచేస్తాం. రూ.2059 కోట్లను ఖర్చుచేసి వచ్చే ఏడాది జూలైనాటికి వెలిగొండ నుంచి ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, ఎర్రగొండపాలెం తదితర ప్రాంతాలకు నీళ్లిస్తాం. వరికపూడిశెల ప్రాజెక్టుకు త్వరితగతిన పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాం." అని చంద్రబాబు ప్రకటించారు.

---

# శాసనసభ ముందుకుతెచ్చే బిల్లులకు కేబినెట్ ఓకే

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- అజెండాలోని 13 అంశాలకు మంత్రిమండలి ఆమోదం



అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతి పరిధిలో గతంలో 343 ఎకరాలకు సంబంధించి ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకునేందుకు క్యాబినెట్‌లో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. లిఫ్ట్ పాలసీ కింద చిన్న సంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపుకు సంబంధించి మంత్రిమండలిలో చర్చించి ఆమోదం తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో పలు భూములను అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్‌కు కన్వర్షన్‌కు సంబంధించి చేసిన ప్రతిపాదనలకు కేబినెట్‌లో ఆమోదముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ బిల్ 2025లో పలు సవరణలు చేస్తూ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో పాటు.. అసెంబ్లీ సమావేశాల్లో సభ ముందుకు తీసుకువచ్చే పలు బిల్లులకు కూడా మంత్రిమండలిలో ఆమోదముద్ర పడింది. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో శుక్రవారం మంత్రిమండలి సమావేశమైంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న దాదాపు 13 బిల్లుల అంశాలకు కేబినెట్ మోదం లభించింది. నాలా ఫీజు రద్దుకు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోని వివిధ చట్టాలను సవరిస్తూ క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీని తాడిగడప మున్సిపాలిటీగా సవరణకు ఆమోదం తెలిపారు.మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955, ఏపీ మున్సిపాలిటీ యాక్ట్ 1965 లకు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ను అనుసరించి ఓటర్ల జాబితా తయారీకి మరో మూడు తేదీలను ఖరారు చేసే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలియజేశారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ, తాడిగడప మున్సిపాలిటీగా మార్చే డ్రాఫ్ట్ బిల్లుకు పలు సవరణలు చేస్తూ కేబినెట్‌లో ఆమోదం ముద్రపడింది. రాజధాని అమరావతి ప్రాంతంలో పెద్ద ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేక వాహక నౌకలను ఏర్పాటు చేస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 13 అజెండా అంశాలతో ఏపీ కేబినెట్ భేటీ అయ్యింది. ఆగస్టు 31లోగా అర్బన్ లోకల్ బాడీలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, ఏపీ సీఆర్డీఏ, రాజధాని ఏరియా మినహాయించి అనథరైజ్‌గా నిర్మించిన భవనాలకు పినలైజేషన్ విధించే ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం తెలిపింది.

---

# ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తాం

**- శాసనసభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



అమరావతి(చైతన్యరథం):రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది సరిగా అమలు జరగడం లేదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. శాసనసభలో శుక్రవారం ప్లాస్టిక్ నిషేధంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రశ్నకు పవన్ సమాధానం ఇచ్చారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌వల్ల పర్యావరణానికి చాలా నష్టం జరుగుతోంది. అసెంబ్లీలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు జరగడంలేదు. ఫ్లెక్సీలను కూడా నిషేధించాలి. కానీ..చాలామంది ఉపాధికోల్పోతారని ఆలోచిస్తున్నాం. బయో డీగ్రేడబుల్ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలని సూచిస్తున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అసెంబ్లీలో ఈఅంశంపై పూర్తిస్థాయి చర్చ జరగాలి. గత ప్రభుత్వం కాలుష్య నియంత్రణ బోర్డు (పీసీబీ)లో ఎవరినీ నియమించలేదు. కాలుష్య నియంత్రణ అనేది స్థానిక సంస్థలతో సంబంధమున్న అంశం.పీసీబీలో ప్రత్యేకంగా ఉద్యోగులులేరు. కాలుష్య నియంత్రణ బాధ్యత పరిశ్రమలదే కాదు.. ప్రజలు, అధికారులది కూడా. విశాఖ ఫార్మాసెజ్‌లో రాంకీ సంస్థకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకున్నాం. వెంటనే చర్యలు తీసుకుంటే చాలా కుటుంబాలు రోడ్డున పడతాయి..గా. రాంకీపై నిర్ణయం తీసుకుంటే గత ప్రభుత్వంలా కక్ష సాధింపు అనే ప్రచారం జరిగే ప్రమాదముంది. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం మా ఉద్దేశం కాదు.. కూర్చోబెట్టి సమస్యను చెబుతాం. గతం ప్రభుత్వంలా ఇప్పుడు జరగదని పవన్ అన్నారు.

---

# మాచర్లకు సీఎం చంద్రబాబు

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సీఎం హాజరు**

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పల్నాడు జిల్లా మాచర్లలో పర్యటించనున్నారు. ప్రతీ నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. ఉదయం 10.30 గంటలకు మాచర్లకు చేరుకోనున్న సీఎం స్థానికంగా ఉన్న చెరువు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొనే ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులతో సీఎం సంభాషిస్తారు. శానిటేషన్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును సందర్శించి... సఫాయి కర్మచారీలు, వైద్య సిబ్బందితో మాట్లాడతారు. అనంతరం స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం మాచర్లలోని ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలిస్తారు. మాచర్ల మున్సిపాల్టీలోని స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళలకు రూ.2 కోట్ల విలువైన మైక్రో క్రెడిట్ చెక్కులను అందించనున్నారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో సీఎం మాట్లాడతారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబర్చిన మున్సిపల్ కమిషనర్లు, వివిధ పాఠశాలల ప్రతినిధులను ముఖ్యమంత్రి సన్మానించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు టీడీపీ కార్యకర్తలతో సీఎం సమావేశమవుతారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

చైతన్యరథం

# హైస్కూలుని దత్తత తీసుకున్న కేంద్రమంత్రి

- రామ్మోహన్‌నాయుడికి మంత్రి లోకేష్ అభినందనలు
- అందరం కలిసి విద్యావ్యవస్థను ఆదర్శంగా నిలుపుదామని పిలుపు

అమరావతి (చైతన్యరథం): శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూలుని దత్తతతీసుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలియ జేశారు. కేంద్రమంత్రి లాగే ప్రజా ప్రతి నిధులు, పారిశ్రామికవేత్తలు, దాతలు, పూర్వవిద్యార్థులు, ఎన్ఆర్ఐలు తమ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. మనమందరం కలిసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తీసుకొచ్చి దేశానికే మన విద్యా వ్యవస్థను ఆదర్శంగా నిలుపు దామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

# కరువు రహిత రాష్ట్రం మా లక్ష్యం

- శాసనసభలో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి(చైతన్యరథం): నీటి పారుదల ప్రాజెక్టులనుపూర్తిచేసి ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యా నికి గురైన నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేసుకుంటూ ముందుకెళ్తున్నట్లు చెప్పారు. శాసనసభలో శుక్రవారం జలవనరులపై లఘు చర్చను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ మేరకు ప్రసంగించారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులపై అంతులేని నిర్లక్ష్యం చూపించిందన్నారు. తమ ప్రభుత్వం ప్రాజె క్టుల సమర్థ నిర్వహణతోపాటు.. ప్రాధాన్య తలు నిర్ధారించుకుని ప్రాజెక్టుల పనులు చేపడుతోందన్నారు. కృష్ణా జలాలతో నేడు డెల్టా ప్రాంతాలను తలదన్నేలా రాయల సీమలో పంటలు పండుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబును అభినవ కృష్ణదేవ రాయలుగా పేర్కొన్నారు. ప్రాధాన్య క్రమంలో తొలి ఏడాది ప్రాజెక్టుల నిర్మాణ పనులు చేపడుతున్నాం. వచ్చే ఏడాది ఉత్త రాంధ్ర ప్రాజెక్టులు ప్రాధాన్యంగా తీసుకుని చేపడతాం. 20-30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేస్తున్నాం. కృష్ణా జలాలను ఆఖరి మైలు వరకు తీసు కెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. 2026 జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడమే మా లక్ష్యం. పోలవరం ఎడమ కాలువ జలాలు ఈ ఏడాది అనకాపల్లి వరకు తీసుకెళ్లే యోచనలో ఉన్నాం. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల పేర్లు చెబితే టీడీపీ గుర్తుకు వస్తుంది. వైసీపీ పేరు చెబితే ఇసుక, గనులు, మద్యం,భూ మాఫియాలు గుర్తుకు వస్తాయి. వైసీపీ పాలనలో ప్రాజెక్టుల నిర్వ హణ సరిగా లేదు. ఈ నేపథ్యంలో తొలి ఏడాది నిర్వహణకు మూడు విడతల్లో రూ.800కోట్లు కేటాయించాం.గత ప్రభు త్వ తప్పిదాలను ఒక్కొక్కటీ సరిచేస్తున్నాం. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా జల వనరులశాఖకు నిధులు కేటాయించామని నిమ్మల రామానాయుడు తెలిపారు.

# రాయచోటిలో హంద్రీ-నీవా ఫేజ్-1 పనులు పూర్తి చేయండి

- సీఎం చంద్రబాబుకు మంత్రి మండిపల్లి వినతిపత్రం
- రూ.450 కోట్ల పనులకు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): రాయచోటి నియోజకవర్గంలోని శ్రీనివాసపురం మండిపల్లి నాగిరెడ్డి హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మండిపల్లి నాగిరెడ్డి హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ ఆయకట్టు నిర్మాణం పూర్తయితే రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి మండలాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు భూగర్భ జలాల నిల్వ పెరుగుతుందని మంత్రి వివరించారు. హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ ఫేజ్-1లో భాగంగా రూ.450 కోట్ల నిర్మాణ పనులకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రిని మంత్రి కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి హామీ ఇచ్చారు.

# టీడీపీలోకి ముగ్గురు ఎమ్మెల్సీలు

- సీఎం సమక్షంలో చేరిన రాజశేఖర్, కళ్యాణ చక్రవర్తి, పద్మశ్రీ
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సీఎం సాద రంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానిం చారు. పార్టీలో చేరిననేతలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు సునీల్, విజయశ్రీ, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, అనురాధ, చిరంజీవి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, బీటీ నాయుడు, రామ్‌గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, సీఎం కార్యక్ర మాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు, ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో.. మరింత విస్తరించిన ఎన్టీఆర్ వైద్యసేవ

- భారీగా పెరిగిన లబ్ధిదారులు, వ్యయం
- మొదటి ఏడాది లబ్ధిదారుల్లో 7, వ్యయంలో 8 శాతం పెరుగుదల
- గత ప్రభుత్వం పెట్టిన రూ.2,221 కోట్ల బకాయిల చెల్లింపు
- నెట్‌వర్క్ ఆసుపత్రులపై నిఘా పటిష్టం
- శాసనసభలో వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఉచిత వైద్యసేవలపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన మంత్రి



అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వ పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత సేవలు పొందే లబ్ధిదారులు, అందుకు సంబంధించిన వ్యయంలో భారీ వృద్ధి నమోదయిందని వైద్యారోగ్యశాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఇందుకు సంబంధిం చిన వివరాలను వెల్లడించారు. తెలిపారు. ఉచిత వైద్య సేవల పథకం అమలుపై కొందరు చేస్తున్న దుష్ప్ర చారాన్ని ఈ వాస్తవాలు గట్టిగా తిప్పికొట్టాయని మంత్రి స్పష్టంచేశారు. ఈ విషయంపై సభ్యుడు మహ మ్మద్ నజీర్ అడిగిన ప్రశ్నకు మంత్రి వివరాణాత్మక సమాధాన్నిచ్చారు.

### నాటికి నేటికి వ్యత్యాసం

కూటమి ప్రభుత్వ పాలనలో మొదటి ఏడాదైన 2024-25లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ లబ్ధిదారుల సంఖ్య 6.68శాతం పెరిగి 13,42,673కు చేరుకుంద ని మంత్రి తెలిపారు. 2023-24లో లబ్ధిదారుల సంఖ్య 12,53,065 అని తెలిపిన మంత్రి కూటమి ప్రభుత్వ పాలనలో లబ్ధిదారుల సంఖ్య దాదాపు 90,000 పెరి గిందని తెలిపారు. ఈ కాలంలో ప్రీ ఆథరైజేషన్ ద్వారా ప్రభుత్వం అనుమతించిన వ్యయం 7.88 శాతం పెరిగిందని మంత్రి చెప్పారు.

ఉచిత వైద్య సేవలకు సంబంధించిన వ్యయం వివరాల్ని కూడా మంత్రి వెల్లడించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత సేవల నిమిత్తం చేసిన వ్యయం జూన్, 2024 నుండి సెప్టెంబరు 1, 2025 వరకు గణనీయంగా పెరిగి రూ.6,458కోట్ల మేరకు ఉండ వచ్చని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఇందు లో 2024-25కు సంబంధించి నిర్ధారణైన ఖర్చు రూ. 4,290.05 కోట్లని, ఇందులో ఇప్పటి వరకు రూ. 3,732.22కోట్ల మేరకుకూటమి ప్రభుత్వం చెల్లింపులు చేయగా మరో రూ.557.83కోట్లు చెల్లించాల్సి ఉందని మంత్రి వివరించారు.దీనికి అదనంగా రూ.2,168.16 కోట్ల బిల్లులు పరిశీలనలో ఉన్నాయని, వీటితో కలిపి కూటమిప్రభుత్వ మొదటి 15నెలల కాలంలోనే ఎన్టీఆర్ వైద్య సేవల ఖర్చు దాదాపు రూ.6,500కోట్ల వరకు ఉంటుందని మంత్రి వివరించారు(గతంలో ఈసేవలపై నెలవారీ ఖర్చు రూ.300కోట్లకు పైగాఉండగా,కూటమి హయాంలో రూ.400 కోట్లకు పైగా ఉంటుంది)

### గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు

కూటమి పాలనలో పెరిగిన ఉచిత వైద్య సేవలకు నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో చెల్లింపులు చేయ డంతో పాటు గత ప్రభుత్వం పెట్టిన రూ.2,221.60 కోట్ల బకాయిలను తమప్రభుత్వం చెల్లించిందని మంత్రి తెలిపారు. ఈ మేరకు పెట్టిన బకాయిల మొత్తం చూస్తే పేదల వైద్యం పట్ల గత ప్రభుత్వానికి ఏ మేరకు చిత్తశు ద్ధి ఉందో వెల్లడవుతోందని మంత్రి దుయ్యబట్టారు.

### దుష్ప్రచారాన్ని ఖండించిన మంత్రి

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల లబ్ధిదారుల సంఖ్య, వ్యయానికి సంబంధించి కూటమి పాలనలో భారీగా వృద్ధి నమోదు చేసినా, ఉచిత వైద్య సేవల పథకం నిర్వీర్యమైందని కొందరు వ్యక్తులు, సంస్థలు దుష్ప్ర చారాన్ని చేయడాన్ని మంత్రి సత్యకుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ పథకం ఆగిపోయిందని దుష్ప్రచారం చేసి, పేదల్ని సేవలకు దూరంగా ఉంచి తద్వారా కొన్ని మరణాలు సంభవిస్తే..వాటిని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలనేది వారి కుట్ర అంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పెరిగిన నిఘా

గత ప్రభుత్వ నిర్వాకాలతో ఉచిత వైద్య సేవల అమలులో అక్రమాలకు సంబంధించి పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వీటిని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం నిఘా పెంచిందని తెలుపుతూ అందుకు సంబంధించిన వివరాల్ని సభలో మంత్రి వెల్లడించారు. 2023-24లో అక్రమాలకు సంబంధించి గత ప్రభుత్వం 28 నెట్ వర్క్ ఆసుపత్రులపై రూ.7.68 కోట్ల మేరకు జరిమానాలు విధించి, అందులో కేవలం రూ.3.75కోట్లు (49శాతం) మాత్రమే వసూలు చేసిందని తెలిపారు.దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం రూ.22.74కోట్ల మేరకు జరిమానాలు విధించి అందు లో రూ.19.35కోట్లు (85 శాతం) వసూలు చేసిందని, దీన్నిబట్టి అక్రమాల్ని అరికట్టే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి వెల్లడవుతోందని మంత్రి సభలో వివరించారు.

### నూతన ఆరోగ్య బీమా పథకం

హైబ్రిడ్ విధానంలో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించే పథకాన్ని త్వరలో అమల్లోకి తెస్తామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. పేదరికంలో ఉన్న 1.43 కోట్ల కుటుంబాలు, పేదరిక రేఖకు ఎగువన ఉన్న 20 లక్షల కుటుంబాలకు రూ.2.50 లక్షల మేరకు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా కల్పిస్తామని మంత్రి అన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలకు రూ.2.50 లక్షలకు పైన రూ.25 లక్షల వరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఆరోగ్య సేవల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి వివరించారు.


గుంటూరు జీజీహెచ్‌కు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.18.77 కోట్ల బకాయిలను చెల్లించదని, మరో రూ.4.09 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందని మంత్రి తెలిపారు. క్యాన్సర్ సేవలకు సంబంధించి గుంటూరు జీజీహెచ్‌ను లెవల్-1 సెంటర్ గా తీర్చిదిద్దేందుకు అధునిక పెట్ సీటీ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పూర్వ విద్యార్థుల సహాయంతో రూపుదిద్దుకుంటున్న నూతన ఎంసీహెచ్ బ్లాక్ కోసం భారీ ఎత్తున పరికరాల్ని కొనుగోలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు.

చైతన్యరథం

## వైసీపీ హయాంలో..

# పశువైద్యంపై అంతులేని నిర్లక్ష్యం

- ఐదేళ్లలో పశువైద్యుల నియామక భర్తీ ఊసే లేదు
- గతంలో 2017, 2018లో సీఎం చంద్రబాబు చొరవతో భర్తీ
- పశువైద్య విద్యార్థుల స్టైపండ్ పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే
- త్వరలోనే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ
- గ్రామాల్లో ఇబ్బంది లేకుండా వెటర్నరీ అసిస్టెంట్ల సేవలు
- శాసనసభలో మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాల పాటు పశు సంవర్థక శాఖకు తాళాలు వేసి పశువైద్యుల నియామక భర్తీకి సంబంధించి ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని, పాడి రైతులు, పశువుల సంరక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. శుక్రవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ 2014-2019 సమయంలో సీఎం చంద్రబాబు చొరవతో పశువైద్యుల నియామక భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి 2017 సంవత్సరంలో 303, 2018లో మరొక నోటిఫికేషన్ ఇచ్చి 223 వెటర్నరీ డాక్టర్ పోస్టులు బర్తీ చేశామని తెలిపారు. 2024 ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయి, ఎలా రిక్రూట్ చేయాలనేది ఆర్థిక శాఖకు నివేదిక అందచేశామని, ఆదేశాలు రాగానే ఖాళీగా ఉన్నటువంటి పశువైద్య డాక్టర్ల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామన్నారు. అప్పటివరకు రాష్ట్రంలో పశువైద్యానికి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా గ్రామస్థాయిలో దాదాపుగా 6137 మంది వెటర్నరీ అసిస్టెంట్లతో వైద్యసేవలు అందచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పశువైద్యుడు లేడనే మాట రాకుండా, పశు వైద్యానికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని, ప్రస్తుతానికైతే ఏ సమస్య లేకుండా చర్యలు చేపట్టామని తెలియజేశారు. పశుసంవర్ధక సహాయకులు గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రాల్లో చురుగ్గా పనిచేస్తున్నారని, అందుబాటులో ఉన్న పశువైద్యుల సాంకేతిక మద్దతుతో సేవలు అందిస్తున్నారని అన్నారు.

### వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌ల ఖాళీల భర్తీకి ప్రణాళిక

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు సంబంధించి 293 ఖాళీలు భర్తీ చేసేందుకు 258 పోస్టులను నిర్ధారించి ఆర్థిక శాఖకు ప్రతిపాదించామని మంత్రి అచ్చెన్న తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రూ.24.84 కోట్లతో ప్రతిపాదనలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖకు తెలియజేశామని, ఆదేశాలు రాగానే రిక్రూట్మెంట్ చేస్తామన్నారు. అదేవిధంగా తిరుపతిలోని వెంకటేశ్వర పశు వైద్యశాలలో అండర్ గ్రాడ్యుయేషన్, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు అందచేసే స్టైపండ్ చివరిసారిగా 2013 వ సంవత్సరంలో పెంచారని, పది సంవత్సరాల తర్వాత కూటమి ప్రభుత్వంలోనే ఇటీవలే ఈ మూడు కేటగిరీల విద్యార్థులకు స్టైపండ్ కూడా పెంచామన్నారు. ప్రస్తుతం యూజీ విద్యార్థులకు 7000 నుంచి 10,500, పీజీ వాళ్లకు 9000 నుండి 13,500, పీహెచ్డీ వాళ్లకి 10,000 నుండి 15,000 రూపాయలకు పెంచి వారి చదువుకి ఇబ్బంది లేకుండా చేశామని తెలిపారు.

### పశువైద్యశాలల పనులకు ప్రతిపాదనలు

రాష్ట్రంలో కొన్ని పశువైద్యశాలలు మరమ్మత్తులకు గురయ్యాయని, కొన్ని చోట్ల ప్రైవేట్ భవనాల్లో హాస్పిటళ్లు నిర్వహిస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని మంత్రి అచ్చెన్న తెలిపారు. 434 పశు వైద్యశాలలకు భవనాలు అవసరమని గుర్తించి ఇందుకు ఆర్ఐడీఎఫ్ కింద, నాబార్డ్‌కి ప్రతిపాదనలు పంపించామని, త్వరితగతిన అనుమతులు పొంది పనులు పూర్తిచేస్తామని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలంలో పశువులు వింత వ్యాధితో చనిపోతున్నాయన్న సమాచారం తెలిసిన వెంటనే అప్రమత్తమై అధికార యంత్రాంగంతో మాట్లాడామని,7 పశువులు చనిపోయాయని, సాంపిల్స్ కలెక్ట్ చేసామని తెలిపారు. వ్యాధి ఎలా సోకుతుందో అందుకు కారణాలు అన్వేషించి నివారణ చర్యలు చేపడతామని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు. 2014-2019 మధ్య వైసీపీ హయాంలో 3 నెలలకొకసారి పశువులకు ఇచ్చే వ్యాక్సిన్‌ను, ప్రతి నెల గ్రామాలలో నిర్వహించే పశు వైద్య శిబిరాలు, దాణా అందచేత కార్యక్రమాలను నిలిపివేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మళ్లీ ఈ సదుపాయాలను పాడి రైతులకు అందచేస్తూ పాడిపరిశ్రమ అభివృద్ధిని గాడిన పెడుతున్నామని మంత్రి అచ్చెన్న తెలిపారు. పశుపోషణను ప్రోత్సహించాలని, దాని వల్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు.

# కొబ్బరి ఉత్పత్తులకు ప్రోత్సాహం

- రూ. 9.96 కోట్లతో రాజోలు నియోజకవర్గంలో కామన్ ఫెసిలిటీ సెంటర్
- విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు మూడు పారిశ్రామిక క్లస్టర్ల గుర్తింపు
- శాసనసభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అమరావతి (చైతన్యరథం): కొబ్బరి ద్వారా విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు పారిశ్రామిక క్లస్టర్లను ప్రతిపాదించిందని, ఎంఎస్ఈ-సీడీపీ పథకం కింద డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో రూ. 9.96 కోట్ల వ్యయంతో రెండు ఎకరాలలో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రాజోలు నియోజకవర్గంలోని తూర్పుపాలెం, అమలాపురం నియోజకవర్గం మామిడికుదురు మండలం పెదపట్నం లంక, ఉప్పలగుప్తంలో ఈ పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని సమాధానమిచ్చారు. రాజోలు నియోజకవర్గంలో కొబ్బరి సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలలో ఉందని, వార్షిక ఉత్పత్తి 30 నుంచి 40 కోట్ల కొబ్బరికాయలు ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతులు కొబ్బరికాయల పీచు తీసి, ఎండు కొబ్బరికాయలను తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మార్కెట్లకు పంపుతున్నారని, అక్కడే ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నారని చెప్పారు. దీనికి కారణం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సమగ్ర కొబ్బరి ప్రాసెసింగ్ పరిశ్రమలు లేకపోవడమేనని, దీనిపై అధ్యయనం చేసి జిల్లా స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా యంత్రాంగం మూడు పారిశ్రామిక క్లస్టర్లు ప్రతిపాదించిందని వీటిలో కొబ్బరి భాగాలను వినియోగిస్తూ విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. కొబ్బరి డొక్కు ద్వారా కాయిర్ ఉత్పత్తులు, కాయిర్ పిత్ బ్లాకులు, జియో టెక్స్‌టైల్, కాయిర్ హస్తకళలు, కోకో లాన్, సోడియం లిగనో సల్ఫోనేట్, కొబ్బరి టెంకెతో హస్తకళలు, బొగ్గు, యాక్టివేటెడ్ కార్బన్, కొబ్బరి నీరుతో ప్యాకేజ్ వాటర్, నాటా-డే-కోకో, కొబ్బరి నీటి పొడి, ఎండు కొబ్బరి కాయతో వర్జిన్ ఆయిల్, లారిక్ యాసిడ్, ఎంసిటి పొడి, చిప్స్, కొబ్బరి పాలు - పాల పొడి, డిసికేటెడ్ పొడి వంటి ఉత్పత్తుల తయారీకి ప్రతిపాదించామని చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 4 కొబ్బరి పీచు తయారీ యూనిట్లు, 18 కొబ్బరి చాప తాయారీ యూనిట్లు, 30 తాళ్ల తయారీ యూనిట్లు, 120 కొబ్బరి తయారీ యూనిట్లు వంటి అనేక చిన్న, మధ్య తరహా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఉన్నాయన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ప్రాసెసింగ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల కాయలను స్థానికంగా పీచు తీసి తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాలకు తదుపరి ప్రాసెసింగ్ కోసం పంపుతున్నారని, ఎంఎస్ఈ-సీడీపీ పథకం కింద రాజోలు నియోజకవర్గంలోని మామిడికుదురు మండలం పెదపట్నం లంకలో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసామని తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్ట్ రెండు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసామని, కొబ్బరి పొడి, నూనె, పాలు వంటి కొబ్బరి ఆధారిత విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడంతో పాటుగా, నిల్వ సౌకర్యాలు, పరీక్షా కేంద్రంపై కావలిసిన సౌకార్యాలపై దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు.

మంత్రి సమాధానంపై జోక్యం చేసుకున్న రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. తన నియోజకవర్గంలోని కడియం మండలంలో కొబ్బరి పరిశ్రమ ఏర్పాటుకు, కొబ్బరి పరిశోధనా కేంద్రానికి 10 ఎకరాల భూమి ఇవ్వడానికి సిద్దంగా ఉన్నామని చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలుపగా ఈ విషయాన్ని కచ్చితంగా పరిశీలించి, అధికారులతో చర్చించి ముందుకు వెళ్తామని మంత్రి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా రాజోలు శాసనసభ్యులు వరప్రసాద్ చేసిన సూచనపై పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను కోరతామని, పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేసి కొబ్బరి ద్వారా విలువ ఆధారిత ఉత్తత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమనం చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శాసనసభలో హామీ ఇచ్చారు.

## ఉల్లి రైతులకు అండ...

# హెక్టారుకు 50 వేలు ఆర్థికసాయం



- సీఎం చంద్రబాబు నిర్ణయం
- వెల్లడించిన మంత్రి అచ్చెన్నాయుడు
- ఉల్లి, ఇతర రైతులకు అండగా ఉంటామని హామీ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియా తో మాట్లాడుతూ ఉల్లి పంట పండించిన రైతులకు హెక్టారుకు రూ.50,000 ఆర్థిక సాయం అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.100 కోట్లు అదనపు భారం పడనుందన్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 45,278 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసారని, సీఎం చంద్రబాబు నిర్ణయంలో 24, 218 మంది రైతులు లబ్ధిపొందుతున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ చర్యకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. పంటకు ధర పలికినప్పుడే ఉల్లిని విక్రయించాలని రైతులకు మంత్రి సూచించారు. మార్కెట్లో సమయానుసారం ధరలు లభించే వరకు రైతులు సహనంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆర్థిక సాయం రైతులకి తక్షణ ఉపశమనం లభిస్తుందన్నారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి రూ.7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని, 2018లో మరొకసారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలు చేసి రూ.6.45 కోట్లు చెల్లించామని తెలిపారు. జగన్ హయాంలో 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770 మద్దతు ధర ప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, కేవలం 250 మంది దగ్గర రూ.75 లక్షలు ఇచ్చి ఉల్లిని కొని రైతులని నిండా ముంచారని మండిపడ్డారు. రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి తమ ప్రభుత్వానికి ప్రాధాన్యతాంశమని ఆయన స్పష్టం చేశారు. రైతుల శ్రమకు గౌరవం కల్పించేందుకు, వారికి న్యాయమైన ధరలు లభించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వర్షాభావం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు భరోసా కల్పించే విధంగా పంటలకు కొనుగోలు ధరలు తగ్గితే ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలబడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి, వారిని ఆర్థికంగా బలపరిచే విధంగా పలు సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తోందన్నారు. కేవలం మాటలకే పరిమితమైపోయిన గత ప్రభుత్వం మాదిరి కాకుండా, మా ప్రభుత్వం రైతులకు తక్షణ ప్రయోజనాలను కలిపిస్తోందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడం తమ ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో కూడా మరింత బలమైన విధానాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

# పంచాయతీల్లో పట్టణ స్థాయి ప్రగతి

- డాక్టర్ అబ్దుల్ కలాం కలల సాకారం దిశగా పల్లెల్లో మౌలిక వసతులు
- గత విధానాల ప్రక్షాళన, క్లస్టర్ విధానం రద్దు
- జనాభా, ప్రాంతం, ఆదాయ ప్రాతిపదికన గ్రేడ్లు
- సిబ్బందిని సర్దుబాటు చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు రాబట్టేలా సంస్కరణలు
- త్వరలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కేబినెట్ ముందుకు నూతన విధానాలు
- అధికారులతో సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): గ్రామ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన లక్ష్యంగా వ్యవస్థలో సమూల మార్పులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుడుతున్నారు. దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కలలను సాకారం చేస్తూ ప్రతి పల్లెలో మౌలిక వసతులు మెరుగుపరచే దిశగా పంచాయతీ కార్యాలయాల్లో పౌర సేవలు సత్వరమే సక్రమంగా అందేలా పాలన వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేయబోతున్నారు. అందుకోసం గతంలో ఉన్న లోపభూయిష్ట విధానాలను గుర్తించి పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తారు. ఈ మేరకు శుక్రవారం శాసనసభలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, సాధారణ పరిపాలన శాఖ, ఆర్థిక, న్యాయశాఖల ఉన్నతాధికారులతో పంచాయతీల పునర్వ్యవస్థీకరణ, నూతన సంస్కరణల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న విధానాలు, అందులో లోపాలు, చేయాల్సిన మార్పులు, చేర్పులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా అమలు చేయనున్న ప్రణాళికలపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. నూతన విధానాలను త్వరలోనే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కేబినెట్ ముందుకు తీసుకువెళతామన్నారు.

**సమూల మార్పులు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక వెనుకబాటు, లోపభూయిష్టమైన పరిపాలన వ్యవస్థలు పంచాయతీల ప్రగతికి అవరోధాలుగా మారాయి. 48 ఏళ్ల క్రితం ఉన్న సిబ్బంది నమూనాయే ఇప్పటికీ అమల్లో ఉంది. గతంలో అమలు చేసిన క్లస్టర్ విధానంలో కూడా ఇబ్బందులు ఉన్నాయి. ఈ విధానాల్లో సమూల మార్పులు తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేయాల్సిన బాధ్యత పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖపై ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

**ఆదాయమే ప్రాతిపదిక కాదు**

గతంలో ఆదాయాన్ని ఆధారంగా చేసుకుని పంచాయతీలకు గ్రేడ్లు నిర్ణయించే వారు. ప్రస్తుతం మనం జనాభా, మండల కేంద్రం, గిరిజన, గిరిజనేతర ప్రాంతం, ఆదాయం అనే అంశాలను విశ్లేషించుకుని పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించబోతున్నాం. ప్రతి పంచాయతీకి కార్యదర్శి స్థాయి అధికారి నుంచి ప్రతి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రస్తుత క్లస్టర్ విధానంలో రెండు మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలను ఒక సెక్రటరీ నిర్వహిస్తున్నారు. నూతన విధానంలో ప్రతి పంచాయతీకి గ్రేడ్ వారీగా సెక్రటరీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పవన్ కళ్యాణ్ చెప్పారు.

ఈ సమావేశంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి, ఏఎస్‌డీ వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ


- రాజధాని అభివృద్ధి అంటే అన్ని జిల్లాల అభివృద్ధి
- మంత్రి నారాయణ ఉద్ఘాటన



విజయవాడ (చైతన్యరథం): అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ పునరుద్ఘాటించారు. విజయవాడలో శుక్రవారం నరేడ్కో సెంట్రల్ జోన్ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌కు మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం బాగుంటే అన్ని రంగాలు బాగుంటాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు రియల్ ఎస్టేట్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిబంధనలు సరళతరం చేశాం. 18 మీటర్ల ఎత్తు వరకూ నిర్మించే భవనాలకు సెల్ఫ్ డిక్లరేషన్ విధానం తీసుకొచ్చాం. గత ప్రభుత్వం అమరావతి రైతులను,రియల్ ఎస్టేట్ వ్యాపారులను అనేక ఇబ్బందులు పెట్టింది. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ. అమరావతిలో మిగులు భూమి అమ్మడం ద్వారా అభివృద్ధి చేస్తాం. రాజధాని అభివృద్ధి అంటే అన్ని జిల్లాల అభివృద్ధి. అమరావతి అభివృద్ధి ద్వారా అన్ని జిల్లాల్లో ఆర్థిక వృద్ధి పెరుగుతుంది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం 100 శాతం అండగా ఉంటుంది. అన్ని అనుమతులు ఒకేచోట ఇచ్చేలా సింగిల్ విండో విధానం అమల్లోకి తీసుకొస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

# సూర్యలంక బీచ్ ఫెస్టివల్ ప్రచారానికి ఫ్లాష్ మాబ్స్

- వివిధ ప్రాంతాల్లో 20 నుండి 25 వరకు నిర్వహణ
- యువత ప్రతిభా ప్రదర్శనకు సరైన వేదిక ఫ్లాష్ మాబ్స్
- వివిధ మాధ్యమాల ద్వారా యూనివర్సిటీలకు ఏపీటీడీసీ ఆహ్వానం
- పాల్గొన్న విద్యార్థులకు 27న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సన్మానం




అమరావతి (చైతన్యరథం): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26,27,28 తేదీల్లో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కు వినూత్న ప్రచారం కల్పించేందుకు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో వివిధ ప్రదేశాల్లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహించేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) సన్నద్ధమైంది. టూరిజం అండ్ సస్టైనబుల్ ట్రాన్స్ ఫార్మేషన్ థీమ్‌తో పర్యాటకానికి ప్రచారంతో పాటు యువత ప్రతిభను ప్రదర్శించే వేదికలుగా ఈ ఫ్లాష్ మాబ్స్ నిలవనున్నాయి. సూర్యలంకతో పాటు విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, హైదరాబాద్‌లలో జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహించి యువతలో ఉత్సాహం కలిగించడంతో పాటు రాష్ట్ర సాంస్కృతిక వైభవం, బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రదర్శించనున్నామని ఏపీటీడీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే ఎస్ఆర్ఎం, కేఎల్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలు ఫ్లాష్ మాబ్‌ల్లో పాల్గొనే విషయాన్ని ధృవీకరించినట్లు స్పష్టం చేసింది. మరికొన్ని యూనివర్సిటీలు తమ ఆసక్తిని ప్రదర్శించాయని, ధృవీకరించాల్సి ఉందని ఈ సందర్భంగా ఏపీటీడీసీ పేర్కొంది. ఫ్లాష్ మాబ్స్‌లో పాల్గొన్న విద్యార్థులను సెప్టెంబర్ 27న వరల్డ్ టూరిజం డే రోజున సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కరించనున్నామన్నారు. సుందరమైన సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌లో సందర్శకులకు వాటర్ స్పోర్ట్స్, బీచ్ సైడ్ గేమ్స్, హౌస్ బోట్ రైడ్స్, జీడి తోటల సందర్శన, స్థానిక సీ ఫుడ్ వంటకాలు, బ్యాక్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్స్‌తో పాటు ఆహ్లాదకరమైన అనుభవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెలబ్రిటీల కచేరీలు, తాటికల్లు రుచి, తదితర కార్యకలాపాల ద్వారా విభిన్న అనుభవాలను అందిస్తామని ఏపీటీడీసీ వెల్లడించింది. ఫ్లాష్ మాబ్‌లలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విశ్వవిద్యాలయాల నిర్వాహకులు pr.communication2023@gmail. comకు తమ వివరాలు పంపించాలని ఏపీటీడీసీ పేర్కొంది. పర్యాటక శాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ వేడుకకు ఏపీ, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశముందని అంచనా వేసింది. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా యువత ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలు రాష్ట్రంలో సుస్థిర పర్యాటకాభివృద్ధితో పాటు స్థానిక సమూహాలను బలోపేతం చేస్తాయని ఏపీటీడీసీ వెల్లడించది. మరిన్ని అప్‌డేట్స్ కోసం ఇన్‌స్టాగ్రామ్ లోని @andhrapradeshtourismను ఫాలో అవ్వాలని సూచించింది.

# క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

- మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటానే ఇందుకు నిదర్శనం
- శాప్ ఛైర్మన్ రవినాయుడు స్పష్టీకరణ
- శాప్ ఛైర్మన్‌ను కలిసిన జాతీయ ఖోఖో క్రీడాకారులు
- మెగా డీఎస్సీలో కొలువులు సాధించిన సందర్భంగా కృతజ్ఞతలు

విజయవాడ (చైతన్యరథం): క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, ఏపీ స్పోర్ట్స్ పాలసీతోపాటు మెగా డీఎస్సీలో క్రీడాకారులకు కేటాయించిన రిజర్వేషన్లే దీనికి నిదర్శనమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫలితాల్లో భాగంగా ప్రభుత్వ కొలువులు సాధించిన 11 మంది జాతీయ ఖోఖో క్రీడాకారులు శాప్ ఛైర్మన్‌ను విజయవాడలోని శాప్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు పెద్దపీట వేయడంతోపాటు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. దానిలో భాగంగా రాతపరీక్ష లేకుండా 3శాతం క్రీడాకోటాలో 421 పోస్టులను క్రీడాకారులకు కేటాయించడం వల్లే ఈరోజు ప్రభుత్వ కొలువులు సాధించామంటూ శాప్ ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా కొలువులు సంపాదించిన మీరు కూడా క్రీడాకారులందరికీ మీవంతు సహాయసహకారాలు అందించాలని, ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఖోఖో ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ సీతారామరెడ్డి, ఖోఖో ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎంవీవీఎస్ ప్రసాద్, కోచ్ డి.లక్ష్మీ నారాయణ, వివిధ జిల్లాలకు చెందిన జాతీయ క్రీడాకారులు క్రాంతి, సతీష్, అప్పలనాయుడు, సురేష్, దాలి నాయుడు, నాగిరెడ్డి, పి.శివారెడ్డి, లక్ష్మీ నారాయణ, రాజ్‌కుమార్, రామ్మోహన్, స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.



# దసరా సెలవులను భారీగా పొడిగించిన విద్యాశాఖ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు దసరా సెలవులపై సర్కార్ తాజాగా కీలక ప్రకటన చేసింది. దసరా సెలవుల తేదీల్లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం (సెప్టెంబర్ 19) ప్రకటించారు. తొలుత ఇచ్చిన ప్రకటన మేరకు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ఇవ్వవల్సి ఉంది. అయితే తాజాగా ఈ తేదీల్లో మార్పులు చేస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. తాజా ప్రకటన మేరకు సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీంతో దసరా సెలవులు కూడా అదనంగా 2 రోజులకు పెరిగాయి. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అయితే 9 రోజులు మాత్రమే సెలవులు రాగా.. తాజా మార్పుతో వీటి సంఖ్య 11 రోజులకు చేరింది. సెప్టెంబర్ 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరడం వల్ల ఈ మార్పు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలోనే విద్యాశాఖ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఇక అక్టోబర్ 3వ తేదీన మళ్లీ పాఠశాలలన్నీ రీ ఓపెన్ కానున్నాయి. జూనియర్ కాలేజీలకు సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు సెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తేదీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దీంతో యథావిధిగా ఇవే తేదీలు కొనసాగనున్నాయి. ఇక క్రిస్టియన్ మైనారిటీ స్కూళ్లకు మాత్రం సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకు సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీరికి మొత్తం 6 రోజుల వరకు దసరా సెలవులు ఇచ్చారు. నిజానికి, సెప్టెంబర్ 3వ తేదీన స్కూల్ రీఓపెన్ ఉన్నప్పటికీ.. సెప్టెంబర్ 5న మిలాద్ ఉన్ నబీ పండగ, సెప్టెంబర్ 7న ఆదివారం, సెప్టెంబర్ 13న రెండో శనివారం, సెప్టెంబర్ 14న ఆదివారం, సెప్టెంబర్ 21న ఆదివారం.. ఇలా ఈ నెలలో విద్యార్థులకు వరుస సెలవులు రానున్నాయి. ఈ ఐదు రోజుల సెలవులు కూడా కలిపితే సెప్టెంబర్‌లో దాదాపు రెండు వారాల పాటు సెలవులు రానున్నాయి.

# మానవత్వం చాటుకున్న ముఖ్యమంత్రి

**●క్యాన్సర్ పేషెంట్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.12 లక్షలు అందజేత**

**●ఎమ్మెల్యే శంకర్ పనితీరును ప్రశంసించిన సీఎం చంద్రబాబు**



శ్రీకాకుళం (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ పత్రిక ఛానల్ జర్నలిస్టు భార్యకు క్యాన్సర్ వ్యాధి సోకడంతో ఆమె వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 12 లక్షల రూపాయలను శుక్రవారం అందజేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ రోగి పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో చేసిన కృషికి పలువురు అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే పనితీరును ప్రశంసించారు. నియోజకవర్గ సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేకు వివరించారు.

# విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎన్. ప్రభాకర్



కురుపాం (చైతన్యరథం): గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి అధికారులను సూచించారు. శుక్రవారం కురుపాంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకులం, ఆదర్శ పాఠశాల, మహాత్మా గాంధీ, జ్యోతిరావుపూలే పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అందుకు తగిన ప్రణాళికలు ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తూ, వారితో కలిసి భోజనం చేశారు. దీనిలో జాయింట్ కలెక్టర్ సీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఉప కలెక్టర్ పీ ధర్మచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన రైల్వే లైన్ పూర్తికి కృషి



మలికిపురం (చైతన్యరథం): కోనసీమలో నర్సాపురం-కోటిపల్లి రైల్వేలైన్ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేందుకు కృషి చేస్తున్నట్లు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి అన్నారు. రాజోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం గుడిమెళ్లంకలో కూటమి నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలైన్ ప్రస్తావన తెచ్చారు. రైల్వేలైన్‌కు నిధుల కొరత లేదని, సాంకేతిక అడ్డంకులు తొలగి పనులు వేగవంతంగా జరిగేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల మధ్య 216 బైపాస్ నిర్మాణం, రాజుల్లంక-రామేశ్వరం మధ్య వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణం కోసం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సహకారంతో అడ్డంకులు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎంపీని కలిసిన వారిలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ రాపాక రమేష్‌బాబు, అంతర్వేది సొసైటీ అధ్యక్షుడు రావూరి నాగు, ఓగూరి మనోహర్, టీడీపీ నాయకుడు చవ్వాకుల వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

# కురుపాంలో మహిళల కోసం ప్రత్యేక వైద్య సేవలు



కురుపాం (చైతన్యరథం): ప్రతి మహిళా తన ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు అన్నారు. కురుపాం మండలం గుమ్మ గ్రామంలో ఏర్పాటు చేసిన 'స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని భాస్కర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా వైద్య సేవలను అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కౌశిక్, మేఘన తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన పీలా గోవింద



అనకాపల్లి పట్టణం : మండలంలోని బవులవాడలో పారిశుద్ధ్య కార్మికులను మాజీ ఎమ్మెల్యే శుక్రవారం సత్కరించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అక్కడ పనిచేస్తున్న కార్మికులను సత్కరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్త మృతి చెందడంతో.. బాధిత కుటుంబసభ్యులకు ఇన్సూరెన్స్ నగదు రూ.5 లక్షలు అందజేశారు. దేశంలో కోటి సభ్యత్వాలు నమోదు చేసుకున్న ఏకైక ప్రాంతీయ పార్టీ టీడీపీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

# నేటి నుంచి ఏపీలో పిడుగులతో కూడి భారీ వర్షాలు



మధ్య బంగాళాఖాతం నుంచి దక్షిణ మహారాష్ట్ర తీరానికి వరకు ద్రోణి విస్తరించడంతో రాయలసీమలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ, ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సముద్ర మట్టానికి సగటున 3.1 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాయలసీమలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. మరోవైపు ఈశాన్య బంగాళాఖాతంలో సెప్టెంబర్ 26న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ సమాచారాన్ని బట్టి ఇది సెప్టెంబర్27 నాటికి వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే రోజు పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించి ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శనివారం కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నాటికి తిరుపతిలో 76.5మిమీ, చిత్తూరు జిల్లా కతేరపల్లెలో 73.2మిమీ, నెల్లూరు జిల్లా దగదర్తిలో 68.2మిమీ, అక్కంపేటలో 55.5మిమీ, కలిగిరిలో 46మిమీ వర్షపాతం నమోదయిందన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చొరవ



అనకాపల్లి పట్టణం : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 11, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖకు సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున వచ్చాయి. ఉద్యోగుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# విజయవాడ ఉత్సవ్‌కు పలువురిని ఆహ్వానించిన ఎంపీ కేశినేని


అమరావతి (చైతన్యరథం): డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీ కృష్ణ శుక్రవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిసి విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానించారు. విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానం పలుకుతూ ఎంపీ కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీ కృష్ణ ఆహ్వాన పత్రిక అందజేశారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు కార్యక్రమాల గురించి ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు.

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజయవాడ ఉత్సవ్ ఆహ్వానం**

అసెంబ్లీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి శుక్రవారం విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీకృష్ణ కలిసి విజయవాడ ఉత్సవ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటే విజయవాడ ఉత్సవ్‌కు విచ్చేయాల్సిందిగా ఆహ్వానించారు.

**మంత్రి నారా లోకేష్‌కు విజయవాడ ఉత్సవ్ ఆహ్వానం**

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను హోమ్ మినిస్టర్ వంగలపూడి అనితతో కలిసి విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీ కృష్ణ శుక్రవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. విజయవాడలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భారీ స్థాయిలో నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానం పలుకుతూ ఎంపీ కేశినేని శివనాథ్ ఆహ్వాన పత్రిక అందజేశారు.







# ప్లాస్టిక్ వ్యర్థాలపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది

●ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయడం కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ప్లాస్టిక్ కాలుష్య సమస్యను గట్టిగా లేవనెత్తారు. పర్యావరణం, ప్రజారోగ్యం రెండింటికీ ఇది తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ని కోరారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "ప్లాస్టిక్ మన జీవితాల్లో చాపకింద నీరులా ప్రవేశించి, ప్రతి ఇల్లు, ప్రతి వీధిని ఆక్రమించింది. గుంటూరులోనే రోజుకు సుమారు 17 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 30% బయోడీగ్రేడ్ కాని పాలిథిన్ కవర్లే. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే నగర డ్రైన్లు మునిగి పొంగిపోవడం, వీధులు జలమయం కావడం కూడా ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వలననే. ఉప్పలపాడు బర్డ్ శ్యాంక్చురీ ఒకప్పుడు ఎనిమిది అడుగుల లోతు ఉండేది. కానీ పర్యాటకులు, ప్రజల నిర్లక్ష్య ప్లాస్టిక్ వాడకం వల్ల ఇప్పుడు అది ఐదు అడుగులకు మాత్రమే తగ్గిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా గుంటూరును ఎయిర్ పొల్యూషన్ హాట్‌స్పాట్‌గా పేర్కొనడం చాలా ఆందోళనకరం" అని తెలిపారు.

**ఫోటోలు చూపిస్తూ, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

"ప్రదర్శనలు, ర్యాలీలకే పరిమితం కాకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్‌లను సమర్థంగా వినియోగించి ప్లాస్టిక్ పై ఉక్కుపాదం మోపాలి. ఇటీవల సచివాలయంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ స్థానంలో గాజు సీసాలు వాడుతున్న నిర్ణయం అభినందనీయం. ఇదే తరహాలో రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు, పర్యాటక కేంద్రములను నో ప్లాస్టిక్ జోన్‌లుగా ప్రకటించాలి. ఫుడ్ తప్పనిసరిగా ప్రోత్సహించాలి." అని సూచించారు.

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి అడిగిన ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ....**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి, సచివాలయాన్ని ప్లాస్టిక్ రహిత జోన్‌గా ప్రకటించింది. దసరా తర్వాత ఎమ్మెల్యే గళ్ళా మాధవి మా దృష్టికి తీసుకొని వచ్చిన ఉప్పలపాడు బర్డ్ శ్యాంక్చురీను దసరా తర్వాత నేను స్వయంగా వెళ్ళి పరిశీలిస్తాను. గాజు సీసాలు, బయోడిగ్రేడబుల్ ప్రత్యామ్నాయాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు, సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పడి, ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీలు చేపడతాయి. ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, మానవ ఆరోగ్యం, పశువులపై తీవ్రమైన ప్రభావాలు పడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాల రహిత జీవితాన్ని గడపాలి

●యాహు సంస్థ, వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో... విద్యార్థులకు డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం



గుడివాడ (చైతన్యరథం): విద్యార్థులు, యువత, అనే వ్యత్యాసం లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరు మాదకద్రవ్యాల రహిత జీవితాన్ని గడపాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సుఖద దంపతులు కోరారు. గుడివాడ పట్టణం ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ సెంటర్లో గల కైకాల కళామందిర్ ప్రాంగణంలో యాహు సంస్థ మరియు వెనిగండ్ల ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. సదస్సులో పలువురు నిపుణులు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో మమేకమవుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై... ఎమ్మెల్యే రాము సుఖద దంపతులు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఉత్సాహంగా సమాధానం చెప్పారు. డ్రగ్స్ వినియోగం వల్ల శరీరానికి కలిగే నష్టాన్ని స్లైడ్ రూపంలో వెనిగండ్ల ఫౌండేషన్ కన్వీనర్ సుఖద విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... డ్రగ్స్ ఏ రూపంలో తీసుకున్న అనర్థమేనని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల నిండు జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. విద్యార్థి దశలోనే డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు రవాణా చేసిన, విక్రయించిన, సేవించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. డ్రగ్స్ మత్తులో ఆలోచన శక్తి కోల్పోయి ఎన్నో అనర్థాలకు కారకులు అవడమే కాకుండా, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయని ఎమ్మెల్యే రాము విద్యార్థులకు తెలిపారు. మన చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే ప్రభుత్వ టోల్ ఫ్రీ 1972 నెంబర్కు సమాచారం అందించడం ద్వారా... వారి జీవితాన్ని కాపాడిన వారం అవుతామని ఎమ్మెల్యే రాము అన్నారు.

# మద్యం స్కామ్, ప్రాజెక్టులపై మాట్లాడలేకే జగన్ అసెంబ్లీకి రావడం లేదు

●ఐదేళ్ల వైసీపీ పాలనలో దోపిడీ తప్ప సాగునీటి ప్రాజెక్టుల్ని పట్టించుకోలేదు

●శాసనసభ సమావేశాల్లో ధ్వజమెత్తిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ / అమరావతి (చైతన్యరథం): మద్యం కుంభకోణం, ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంపై సమాధానాలు లేకనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని ఎద్దేవా చేశారు వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మళ్లించి ప్రతిఎకరాకు నీళ్లివ్వాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకుంటే దానిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని, గతంలోనూ వాళ్లు ఇలా నే కేసీఆర్‌తో కుమ్మక్కై ప్రాజెక్టుల్ని అడ్డుకున్నారని మండిపడ్డారాయన. శుక్రవారం ఈ మేరకు అసెంబ్లీలో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయు జగన్ సభకు హాజరు కాకపోవడాన్ని తప్పుబట్టారు. అలానే అయిదేళ్ల వైకాపా పాలనలో సాగు నీటి ప్రాజెక్టులకు చేసిన నష్టాన్ని గణాంకాలతో సహా వివరించారు. 2014-19 మధ్య గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇరిగేషన్‌పై 79వేల 742కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆ అయిదేళ్లలో 7 లక్షల కోట్ల బడ్జెట్‌లో అధికభాగం సాగునీటి రంగానికి ఇచ్చామని 11.4శాతం ప్రాజెక్టుల మీద ఖర్చు చేసినట్లు తెలిపారు. వైకాపా పాలనలో 12లక్షల కోట్ల బడ్జెట్ పెట్టుకుని ప్రాజెక్టులకు 22వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. అయిదేళ్ల బడ్జెట్‌లో కేవలం 1.9% ప్రాజెక్టులకు ఇవ్వడం బట్టే రైతులపై వారికి ఉన్న శ్రద్ధ, చిత్తశుద్ధి ఏమిటో తెలుసుకోవచ్చన్నారు. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వ లేదు. రైతులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఆ దుస్థితి మార్చేలా ఎన్డీయే ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, ఇప్పటికే 34వేల 724కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 5ఏళ్ల వైకాపా పాలనలో చేసిన దానికంటే కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలో చేసిన ఖర్చే ఎక్కువన్నారు. తెలుగుదేశం గత ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం 12వేల 441 కోట్లు ఖర్చు చేస్తే జగన్ కేవలం 2 వేల కోట్లే ఖర్చు చేశారని, అది వారి అయిదేళ్ల బడ్జెట్‌లో 0.02శాతం అని చెప్పుకోవడానికి సిగ్గు ఉండాలన్నారు. కొన్ని ఆ బిల్లులు కూడా చెల్లించక పోతే ఈ ప్రభుత్వం వచ్చాక చెల్లించామన్నారు. అలాంటివారికి రాయలసీమ పేరెత్తడానికి అర్హత ఉందా అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు అంతే చేశారని గత తెలుగుదేశం ప్రభుత్వంలో 1832 కోట్లు ఖర్చు చేస్తే, వైకాపా ప్రభుత్వం కేవలం 594కోట్లే వ్యయం చేసినట్లు తెలిపారు. పోలవరాన్ని తెలుగుదేశం ప్రభుత్వంలో 72శాతం పూర్తి చేస్తే వైకాపా ప్రభుత్వంలో 2శాతం కూడా చేయలేదని, మొదటి 15నెలలు అసలు పనులు చేయకుండా రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేయడంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని. ఆ భారం పాపం ఎవరిదని ప్రశ్నించారు. అప్పట్లో పోలవరం కోసం కేంద్రం ఇచ్చిన నిధులు కూడా పక్కదారి పట్టించారని, వాళ్లకు ఆ ప్రాజెక్టు పూర్తి చేసే ఆలోచనే లేదన్నారు. జగన్ సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుని పోవడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు.

# జీజీహెచ్‌కు మరిన్ని నిధులు కేటాయించాలి

●మౌలిక సదుపాయాలు పెంచాలి

●అసెంబ్లీ సాక్షిగా గళం వినిపించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

●సానుకూలంగా స్పందించిన వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



గుంటూరు (చైతన్యరథం): నిరుపేదల వైద్యానికి వరప్రదాయినిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై అసెంబ్లీ సాక్షిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ గళం వినిపించారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి తీసుకున్న అభివృద్ధికి కార్యక్రమాలను వివరిస్తూనే.. జీజీహెచ్‌కు రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యను బట్టి మౌలిక వసతులు కల్పించాల్సిన విషయాన్ని ప్రస్తావించారు. జీజీహెచ్ కు ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయించాలని కోరారు. ప్రతి రోజూ 3 నుంచి 4 వేల వరకు మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారని, 1500 వరకు బెడ్లు ఉన్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని, ఈ క్రమంలో ప్రజలకు జీజీహెచ్ పై నమ్మకం పెరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జీజీహెచ్ ప్రజలకు వరప్రదాయినిగా మారిందని, దాతలు కూడా ఉదార స్వభావంతో నిధులు అందిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌కు మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని విన్నవించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పేరిట ప్రైవేటు ఆస్పత్రులకు నిధులు ధారాదత్తం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే నసీర్ అడిగిన అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద 13.42 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.

# రిలయన్స్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు ఎప్పుడండీ



## అసెంబ్లీలో గళమెత్తిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సర్వేపల్లి, (చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాల్లో సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశ్రమల గురించి ప్రస్థావించారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో రిలయన్స్ కంపెనీకి 2007లో ఎకరా రూ.7.50 లక్షల చొప్పున 2700 ఎకరాలు కట్టబెట్టారన్నారు. 18 ఏళ్లు దాటుతున్నా ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. అసలు ఆ కంపెనీ పరిశ్రమలు పెట్టగలదా, లేదా అని నిలదీశారు. సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉండే భూములను రైతులు 18 ఏళ్లుగా బీడుగా పెట్టుకున్నారన్నారు. కిసాన్ సెజ్‌లో 2600, రిలయన్స్ కోసం తీసుకున్న 2700 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. కృష్ణపట్నం సెజ్ కోసం రైతులకు ఎకరాకు రూ.4 లక్షలు, ప్రభుత్వ భూమికి రూ.1లక్ష చెల్లించి 6 వేల ఎకరాలకు పైగా సేకరించారన్నారు. దశాబ్దాలుగా వేలాది ఎకరాల భూములు ఖాళీగా మిగిలిపోతున్నాయన్నారు. ఆ భూములు బీడుగా ఉండటంతో రైతు కూలీలకు కూడా ఉపాధి లేకుండాపోయిందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను వెనక్కు తీసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీనికి సమాధానంగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు మంత్రి టీజీ భరత్ ప్రకటించారు.

# రైతులకు నష్టం వాటిల్లకుండా ఉల్లి పంటను కొనండి

### వ్యాపారులకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచన



కడప, (చైతన్యరథం): జిల్లాలో పండించిన ఉల్లి పంటను రైతులకు సష్టం వాటిల్లకుండా మార్కెటింగ్ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి ఉల్లి పంట కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ఉల్లి వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉల్లి కొనుగోళ్లపై వారికి పలు సూచనలు చేశారు. నష్టాల్లో ఉన్న రైతుల నుంచి అధిక లాభాలను ఆశించవద్దని ఉల్లి వ్యాపారులకు కలెక్టర్ సూచించారు. రైతులు వ్యాపారస్థులు, ప్రభుత్వం సమన్వయంతో మార్కెటింగ్ వ్యవహారాలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా. జిల్లాలో ఉల్లి నిల్వలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని మార్క్‌ఫెడ్‌అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, జిల్లా మార్క్ ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఏడీ ఆజాద్ వలి, ఉల్లి వ్యాపారులు పాల్గొన్నారు.

## ఐటీఐల్లో జర్మన్ భాషపై శిక్షణ

జమ్మలమడుగు, (చైతన్యరథం): ప్రభుత్వ ఐటీఐలకు దశ తిరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త భాష నేర్చుకుని విదేశీ ఉద్యోగాలు పొందేందుకు ఏడీ స్కిల్ డెవస్ మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఐటీఐల్లో చదువుకుంటున్న విద్యార్థులకు జర్మన్ భాష నేర్చుకునేలా శిక్షణ ఇస్తోంది. ఇందుకుగాను ప్రతి సోమ, బుధవారాల్లో ఉదయం 10 నుంచి 11 గుటులు వరకు ఆన్‌లైన్లో తరగతులు నిర్వహిస్తోంది. మొత్తం మూడు నెలలపాటు శిక్షణ ఉంటుంది. అవసరమైతే ఆరు నెలల వరకు గడువును పొడిగించనున్నట్లు అధిదారులు చెబుతున్నారు. శిక్షణ పూర్తైన తర్వాత పరీక్ష నిర్వహించి ధ్రువపత్రం అందజేస్తారు. జిల్లాలో పది ప్రభుత్వ ఐటీఐలు ఉండగా ద్వితీయః సంవత్సరంలో 111 మంది విద్యార్థులున్నారు. వీరందరూ జర్మన్ భాష నేర్చుకునేలా సంబంధిత ప్రిన్సిపాళ్ళు పోత్సహిస్తున్నారు. ఈ విషయమై జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ మాట్లాడుతూ, జర్మనీలో ఉత్పత్తి తయారీ యూనిట్లలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. భాష నేర్చుకుంటే జర్మనీలో కచ్చితంగా ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు.

# ఏపీ నీ ి ా క్కు లహాపోండి

## కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంపై మాజీ మంత్రి సోమిరెడ్డి ఆందోళన

అమరావతి, (చైతన్యరథం): కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచేందుకు సన్నాహాలు చేస్తోందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. అదనంగా 130 టీఎంసీల కృష్ణా జలాలను మళ్లించుకునేందుకు ఒక లక్షా 33 వేల ఎకరాల భూసేకరణ చేసి రూ.70 వేల కోట్లు ఖర్చుపెట్టాలన్నారు. మూడు రోజుల క్రితం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నారన్నారు. మరోవైపు తెలంగాణ సైతం అదే సన్నాహాల్లో ఉందని వెల్లడించారు. కృష్ణ ట్రిబ్యునల్ తుది వాదనల్లో దాదాపు 16 స్కీములకు ప్రాజెక్టు రిపోర్టు చేశారన్నారు. జూరాల నుంచి వరద కాలువల ద్వారా 100 టీఎంసీలు, నెట్టెంపాడు ఫేస్ -2 ద్వారా 4 టీఎంసీలు, కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా 16 టీఎంసీలు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. తెలంగాణ మొత్తం 16 స్కీముల ద్వారా 150 టీఎంసీలు తరలించుకుపోయే ప్రయత్నం చేస్తోందిఓ వైపు కర్నాటక 130 టీఎంసీలు, ఇంకోవైపు తెలంగాణ 150 టీఎంసీలు తరలించుకునేలా రాబోయే రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులను సిద్ధం చేసుకుంటున్నాయన్నారు. ఆ నీళ్లను హక్కులకు లోబడి తరలించుకుంటారా, లేక ఇష్టప్రకారం తీసుకెళతారా అనే అంశంపై మనం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మన హక్కులను కాపాడుకోకపోతే ఏపీలో కృష్ణా జలాలపై ఆధారపడిన రైతులు, సామాన్య ప్రజల భవిష్యత్ ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉంది ఈ అంశాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకోవాలన్నారు. తమ నియోజకవర్గంలోని సర్వేపల్లి రిజర్వాయర్ ప్రమాదకర పరిస్థితిలో ఉందని 1.7 టీఎంసీల నిల్వ సామర్ధ్యం కలిగిన సర్వేపల్లి రిజర్వాయర్ 2015లో బ్రీచ్ అయ్యే పరిస్థితి వచ్చింది అప్పట్లోనే రిజర్వాయర్ ఆధునీకరణకు మన ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వాయర్‌ను మరింత డ్యామేజ్ చేశారన్నారు. సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునీకకరణకు నాబార్డ్ నిధులు రూ.50 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపివున్నాయని వెల్లడించారు. ఆ నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరుతున్నాను సోమశిల డ్యాం ఆప్రాన్ ప్రమాదకరపరిస్థితిలో ఉన్నందున పెండింగ్ బిల్లులు రూ.12 కోట్లు విడుదల చేసి పనులు వేగవంతమయ్యేలా చూడాలని కోరారు. ఎస్.ఎస్.ఎల్.సీ ప్రాజెక్టుకు సంబంధించి కూడా రూ.92 కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి సోమశిల - కండలేరు ఫ్లడ్ ఫ్లో కెనాల్ విస్తరణ పనులకు సంబంధించి కూడా 86 కోట్లు చెల్లించాల్సివుంది ఏఎస్ఆర్ సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న రూ.195 కోట్లు కూడా త్వరితగతిన మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలని కోరారు.





# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు క్షేత్రస్థాయిలో ప్రణాళికలు

## భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి, టీటీడీ ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల, (చైతన్యరథం): తిరుమల పవిత్రత కాపాడటమే కాకుండా సాధారణ భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం ముఖ్య లక్ష్యంగా పని చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సూక్ష్మ, క్షేత్రస్థాయి ప్రణాళికలు రూపొందించి భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో ఆయన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, టీటీడీ వివిధ విభాగాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వివరించారు.



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితను కలిశారు. సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందజేశారు.

# నెల్లూరులో క్లీనప్ డ్రైవ్

## పొలిటికల్ టీంతో కలిసి పర్యవేక్షించిన డాక్టర్ గణేశ్ కుమార్

నెల్లూరు సిటీ, (చైతన్యరథం): రాష్ట్ర మంత్రివర్యులు పొంగూరు నారాయణ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్యం కోసం 47వ డివిజన్‌లో డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్, పొలిటికల్ టీం ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు నగర 47వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కలవకుంట భాస్కర్, ఇంచార్జ్‌లు కంచి కృష్ణ, నీలకంఠం మునికృష్ణ, సునీల్ సింగ్ గౌడ్, టిడిపి నాయకులు కలిసి పర్యటించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో భాగంగా మునిసిపల్ సిబ్బందితో కలిసి శుభ్రపరిచే పనులను పర్యవేక్షించారు. పలు ప్రాంతాలలో తిరుగుతూ ప్రజల సమస్యలు విని, వెంటనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నారు. మురుగునీరు, చెత్త గుట్టల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు. హైజిన్‌పై అవగాహన కల్పిస్తూ, పరిశుభ్రత కోసం అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శానిటేషన్ సెక్రెటరీ మోసెస్‌తో పలు డివిజన్లో పలు సమస్యలపై చర్చించారు. మునిసిపల్ స్వీపింగ్ వాహనాలతో వీధుల్లో శుభ్రపరిచే పనులు కొనసాగుతున్నాయన్నారు.



# మా జిల్లాలో పరిశ్రమలు స్థాపించండి

**అసెంబ్లీలో గళమెత్తిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి, (చైతన్యరథం): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని ఈ ప్రాంతంలో అందుకు అనువుగా తగినన్ని భూములు ఉన్నాయని పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లా కర్ణాటక రాజధాని బెంగళూరుకు మరి ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఉండడం వల్ల ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన ప్రాంతమని శుక్రవారం శాసనసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. అదేవిధంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని కప్పల బండ పంచాయతీలో ఏపీఐఐసీ ద్వారా 2017 లో ఎకరా 11.74 లక్షల తో 104. 64 ఎకరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో అప్పటి మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పరిశ్రమలు ఏర్పాటుకు భూముల సేకరించారన్నారు. పుట్టపర్తి మండలం కప్పల బండ పంచాయతీలో సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు కోసం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారు ఎంతమందికి అనుమతులు ఇచ్చారు ఇంకా ఎంత మిగులు భూమి ఉందో తెలపాలని ప్రభుత్వం ద్వారా సంబంధిత పరిశ్రమల శాఖ మంత్రి వెల్లడించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు. అదేవిధంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు ప్రత్యేకంగా మహిళలకు ప్రభుత్వం ద్వారా పరిశ్రమలకు రాయితీలు, విద్యుత్ రాయితీ వంటి సౌకర్యం కల్పించే అవకాశాలు ఉన్నాయా అని అడిగారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా 2008 నుంచి 2009 మధ్యకాలంలో పుట్టపర్తి నియోజకవర్గం లోని అమడ గూరు ప్రాంతంలో లక్ష కోట్లతో 65 వేల ఎకరాలలో సుమారు 60 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సైన్స్ సిటీ ఏర్పాటు చేస్తామని ఆనాటి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చి ఏపీఐఐసీ ద్వారా సుమారు 402 ఎకరాలు ప్రభుత్వం ద్వారా సేకరించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐసీ ద్వారా సేకరించిన భూములతో పాటు ప్రైవేట్ పరంగా ఎంతో అనుకూలమైన భూములు చౌక ధరకు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిని కోరారు. బెంగళూరుకు అత్యంత దగ్గరగా ఉండడంతోపాటు మిగతా ప్రాంతాల కంటే ఈ ప్రాంతంలో తక్కువ ధరకే భూములు లభించే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ప్రభుత్వం ద్వారా మెగా సోలార్ ప్రాజెక్టు ఏమైనా నెలకొల్పే అవకాశాలు ఉన్నాయా? అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వం ద్వారా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిని ప్రత్యేకంగా కోరారు.



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, మంత్రి సవితను కలిసి సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందజేశారు.



# రాయలసీమలో వర్షాలు

**విపత్తుల నివారణ శాఖ అధికారుల వెల్లడి**

అమరావతి, (చైతన్యరథం): మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ , ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సముద్ర మట్టానికి సగటున 3.1 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాయలసీమలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. మరోవైపు ఈశాన్య బంగాళాఖాతంలో సెప్టెంబర్ 26న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ సమాచారాన్ని బట్టి ఇది సెప్టెంబర్27 నాటికి వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే రోజు పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించి ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నాటికి తిరుపతిలో 76.5మిమీ, చిత్తూరు జిల్లా కతేరపల్లెలో 73.2మిమీ, నెల్లూరు జిల్లా దగదర్తిలో 68.2మిమీ, అక్కంపేటలో 55.5మిమీ, కలిగిరిలో 46మిమీ వర్షపాతం నమోదయిందన్నారు.




# వైద్య విద్యార్థికి మంత్రి సవిత సాయం

**తల్లిదండ్రులకు అందజేసిన ఎస్సార్ఆర్ ట్రస్టు ప్రతినిథులు**

పెనుకొండ, (చైతన్యరథం): పెనుకొండ మండలం అడదాకులపల్లి గ్రామానికి చెందిన రవీంద్రనాయక్, లతాబాయిల ఇద్దరు కుమారులు సరస్వతీ పుత్రులే. రవీంద్రనాయక్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు డేనియల్ నాయక్ ఇప్పటికే వైద్య విద్యను దాతల సహాయం పొంది చదువుతున్నాడు. ఇప్పుడు రెండో కుమారుడు సంతోష్ నాయక్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు.. కళాశాల ఫీజు చెల్లించినా వసతి ఖర్చులు చెల్లించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తమ ఎస్సార్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి 30,000 ఆర్థిక సహాయం అందచేసారు. ఈ సందర్భంగా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో వారి తల్లిదండ్రులకు ట్రస్ట్ డైరెక్టర్లు, నాయకులు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేసవయ్య, సీనియర్ టీడీపీ నాయకులు నారాయణ స్వామి, గుట్టుర మాజీ సర్పంచ్ సూర్యనారాయణ కన్వీనర్ ప్రసాద్, కుపేంద్ర ఎస్సార్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ నాగార్జున డైరెక్టర్లు, నీరు గంటి చంద్రశేఖర్, రామాంజనేయులు, బాబుల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# మడకశిర టీడీపీలోకి వైసీపీ శ్రేణుల వలసలు

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి**

మడకశిర, (చైతన్యరథం): పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రోళ్ళ మండలం కాకి (కాంచన కిరీటం ) గొల్ల హట్టి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మెంబర్ సిద్ద గంగప్ప , శివన్న, కామన్న, సునీల్, రమేష్ హరీష్, రవికుమార్, లింగరాజు, హనుమ దాసప్ప, మూర్తి, వీరితోపాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పసుపు కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి గుండుమల తిప్పేస్వామి ఆహ్వానించారు. ఆహ్వానించి పార్టీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తున్న తరుణంలో మడకశిర నియోజకవర్గంలో అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు పరిశ్రమలు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గానికి వస్తున్నాయని అదేవిధంగా సాగునీరు కోసం ప్రణాళికలు రూపొందించి హంద్రీనీవా కాలువ పనులు ప్రారంభించడం చూసి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరామన్నారు. గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వ పాలనలో వైయస్ జగన్మోహన్ రెడ్డి తమలాంటి కార్యకర్తలను పట్టించుకోకుండా వదిలేశారన్నారు. స్థానిక వైసీపీ మాజీ ఎమ్మెల్యే మడకశిర నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపట్టకుండా అతని పదవీ కాలమంతా వసూళ్లకు సమయం కేటాయించారన్నారు. మేము వైసీపీ పార్టీలో ఎంత కష్టపడి పని చేసిన గుర్తింపు ఇవ్వకపోవడంతో అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ అధిష్టానం మారుతుందని ఇన్ని రోజులు వేచి చూశామన్నారు. మారకపోవడంతో, రోళ్ళ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని గత ఐదు సంవత్సరాలలో నిర్వీర్యం చేసి ఆరోగ్య సిబ్బందిని నియమించకుండా అస్తవ్యస్తం చేసి తాజాగా మెడికల్ కళాశాల గురించి ప్రజలకు వివరించే కార్యక్రమం చేపడుతున్నామని బూటకపు డ్రామా తెరకెక్కించడంలో వైసీపీ నాయకులు సిద్ధహస్తులని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోళ్ళప్రభుత్వ ఆసుపత్రికి ఎక్సరే యూనిట్ బ్లడ్ బ్యాంక్ యూనిట్ మంజూరు అయ్యాయని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో వైసిపి పార్టీలో ఉండలేక తెలుగుదేశం పార్టీలో చేరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల కన్వీనర్ ఈరన్న, డైరెక్టర్ రామకృష్ణ, నరసింహమూర్తి, రాజు, గోవింద రాజు, మోహన్, రాజు, రంగనాథప్ప, నాయకులు పాల్గొన్నారు.



# రోదసీలో శరీరం మనపైనే తిరగబడుతుంది

### భారతీయ వ్యోమగామి వెల్లడించిన అంతరిక్ష యాత్ర అనుభవాలు



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఆయన అంతరిక్షంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యల గురించి తాజాగా వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు.

"స్పేస్ మిషన్ ప్రారంభమైన దగ్గరి నుంచి ఎంతో ఉత్సుకత ఉంటుంది. అయితే మనం మైక్రోగ్రావిటీ పరిస్థితులకు చేరుకుంటాం. అవి మన శరీరానికి పూర్తిగా కొత్త. దాంతో అంతా మారిపోతుంది. రక్తప్రసరణలో తేడా వస్తుంది. ముఖం ఉబ్బుతుంది. గుండెవేగం మందగిస్తుంది. మీ వెన్నెముక సాగుతుంది. తరచూ నడుము నొప్పి వస్తుంటుంది. మీ పొట్టలోని పదార్థాలన్నీ తేలినట్టుగా అనిపిస్తాయి. దాంతో ఆకలి అనిపించదు. అంతరిక్షంలోకి వెళ్లిన మరుక్షణం నుంచే ఈ మార్పులన్నీ వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మనం శరీరం తిరగబడుతుంది" అని శుక్లా వెల్లడించారు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణకు ముందు తాను క్లిష్ట పరిస్థితి ఎదుర్కొన్నట్లు చెప్పారు. అప్పుడు తనకు వికారంగా అనిపించిందని, తలనొప్పితో బాధపడ్డానని చెప్పారు. "వికారానికి మందులు వేసుకుంటే మగత ఉంటుందని అవి కూడా వేసుకునే వీలు లేకుండా పోయింది" అని చెప్పారు. అప్పుడు తమ బృందం సభ్యులు ఎంతో సహకరించారని చెప్పారు. అక్కడ వ్యోమగాములు ఒకరిపై ఒకరు ఆధారపడాల్సి ఉంటుందని అన్నారు. ఐఎస్ఎస్‌లోని పరిస్థితులు మన సహనానికి పరీక్ష పెడతాయని చెప్పారు. అయితే బృంద కృషి, పట్టుదల ఎంతో అవసరం అని అన్నారు. అంతరిక్ష యాత్ర కోసం ఏడాది కాలం అమెరికాలో శిక్షణ పొందిన శుభాంశు శుక్లా.. జూన్ 25 నుంచి జులై 15 వరకూ ఆయన రోదసీ యాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే.

## తీరు మారని పిట్రోడా

### ఇరకాటంలో పెట్టినా కొమ్ము కాస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ శామ్‌పిట్రోడా మరోసారి వార్తల్లో నిలిచారు, పొరుగు దేశాలకు ప్రాధాన్యమిచ్చేలా మన విధానాలు ఉండాలని సూచించిన ఆయన.. పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు తనకు సొంతింట్లో ఉన్న భావన కలిగిందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. సొంతపార్టీని ఇరకాటంలో పెట్టారు.

"మన విదేశాంగ విధానంలో మొదట మన పొరుగుదేశాలపై దృష్టి పెట్టాలన్నది నా అభిప్రాయం. పొరుగుదేశాలతో మనం సంబంధాలను గణనీయంగా మెరుగుపర్చుకోగలమా..? ఇక్కడ మీతో విషయం చెప్పాలని అనుకుంటున్నాను. పాకిస్థాన్ కు వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న భావన కలిగింది. బంగ్లాదేశ్, నేపాల్కు వెళ్లినప్పుడు కూడా అలాగే అనిపించింది. పరాయి దేశంలో ఉన్నట్టు అనిపించలేదు" అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారు.వీటిపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "పాక్ వెళ్లినప్పుడు ఇంట్లో ఉన్న భావన కలిగిందని రాహుల్ గాంధీ ఎంతో ఇష్టపడే వ్యక్తి శామ్ పిట్రోడా చెప్పారు. 26/11 మారణహోమం తర్వాత కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం పాక్పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు" అని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి మండిపడ్డారు.తరచూ సొంత పార్టీని ఇరకాటంలో పెట్టేలా శామ్ పిట్రోడా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వారసత్వ పన్ను విధానంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అమెరికాలోని ఓ విధానాన్ని ఉటంకిస్తూ.. "ఒక వ్యక్తి దగ్గర 100 మిలియన్ల డాలర్ల విలువైన సొత్తు ఉందనుకుంటే. ఆ వ్యక్తి మరణం తర్వాత అందులో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు బదిలీ అవుతుంది. మిగిలిన 55 శాతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుం టుంది" అని వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశమైంది.గతంలో చైనా గురించి మాట్లాడిన మాటలపై కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. తన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు రావడంతో పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. తర్వాత హస్తం పార్టీ ఆయన్ను అదే పదవిలో నియమించడం గమనార్హం.

## పక్కా ప్రణాళికతోనే ఆపరేషన్ సింధూర్

### - ప్రశ్నించే మనవాళ్ల నోళ్లను రజువులే మూయించాయి
### - వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్‌సింగ్



బాలాకోట్ దాడులు చేసినప్పుడు.. ఏమీ కనిపించడం లేదంటూ తమని పదేపదే ప్రశ్నించారని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మాత్రం పక్కా ప్లానింగ్ వ్యవహరించినట్లు వెల్లడించారు. ఆయన న్యూఢిల్లీలో జరిగిన వార్షిక సమావేశంలో మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. "బాలాకోట్‌పై దాడులు చేసిన సమయంలో మన వాళ్లే చాలా ప్రశ్నించారు. మనం మనవాళ్లనే ఎక్కువ అడుగుతాము. పక్కన వాళ్ల గురించి పట్టించుకోము. అక్కడేమీ కనిపించడంలేదు అన్నారు. బాలాకోట్ ఉపగ్రహ చిత్రంలో కేవలం మూడు చుక్కలు కనిపిస్తున్నాయి. మాకు అక్కడ లోపల ఏం జరిగిందనే దానిపై ఇంటెలిజెన్స్ లేదు. వారికి చెప్పలేకపోయాం. కానీ, హ్యూమన్ ఇంటెలిజెన్స్‌లో అక్కడ ఎంత మంది చనిపోయారు. అంత్యక్రియలు ఎన్ని జరిగాయనేది తెలిసింది. అయినా మనవాళ్లకు నచ్చజెప్పలేకపోయాం. ఈ సారి (ఆపరేషన్ సిందూర్) చూడండి.. మురిద్కేలో కూడా చిన్న చుక్కలానే ఉపగ్రహ చిత్రంలో కనిపించింది. కానీ, ఈ సారి జర్నలిస్టు ఒకరు దానిని కవర్ చేశారు. మురిద్కేలోని లష్కరే స్థావరం ఎంతగా దెబ్బతిందో తెలుస్తుంది. మా ఆయుధ సామర్థ్యాన్ని ప్రశ్నించిన వారు అక్కడి భవనంపై ఏర్పడిన రంధ్రాలను చూస్తే తెలుస్తుంది.

గతం నుంచి పాఠాలు నేర్చుకొన్నాం. ఈ సారి బలమైన రాజకీయ సంకల్పంతో రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. త్రివిధ దళాలు సీడీఎస్, ఇతర ఏజెన్సీలతో కూర్చొని మాట్లాడుకొని పక్కా ప్లానింగ్ చేసుకొన్నాయి" అన్నారు.

ఇటీవల కాలంలో వచ్చిన ఆయుధాలే వాడాము.

అంతకు ముందు ఏపీ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ కోసం వాడిన ఆయుధాల వివరాలను చెప్పారు. "ఈ సారి చాలా వరకు ఇటీవల దళాల్లో చేరినవే ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా భారత్ కృషితో సిద్ధమైనవే. ఉగ్రవాదులే మాకు లక్ష్యాలను ఇచ్చారు.. మేము కచ్చితత్వంతో వాటిని ఛేదించాము. ఆ తర్వాత శత్రువు యుద్ధాన్ని ఆపకుండా మాతో పోరాటానికి వచ్చారు. అప్పుడు మేము వారి బేస్‌లు, చాలా ఆయుధాలు, వ్యవస్థలు, రాడార్లు, కంట్రోల్ కమాండ్ సెంటర్లను ధ్వంసం చేశాము. ఇవన్నీ ఇంటర్నెట్లో ఉన్నాయి" అని పేర్కొన్నారు.

## దుర్గా పూజకు మొలకెత్తిన పాటల విత్తనాలు

### పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కదిలించిన కలం



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలోని తాలా ప్రత్యేయ్ దుర్గా పూజా కమిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 'బీజ్ అంగన్' (పెరట్లో విత్తనాలు) అంటూ ప్రత్యేకగీతాన్ని రాశారు. ఈ పాటను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఇంద్రనీల్ సేన్ ఆలపించడం విశేషం. బెంగాల్ దుర్గాపూజలో నువ్వులు తదితర విత్తనాలతో పెట్టే నైవేద్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్ర వారసత్వ సంపదగా వస్తున్న దుర్గాపూజకు స్ఫూర్తినిచ్చేలా ముఖ్యమంత్రి పాట రాయడం, దానికి మంత్రి తన గాత్రాన్ని అందించడం గౌరవ సూచకంగా నిర్వాహకుల తరపున ధృభజ్యోతి బోస్ సువో హర్షం వ్యక్తం చేశారు. ఈ పాట మ్యూజిక్ వీడియోను మంత్రి విడుదల చేశారు. దుర్గాపూజ కమిటీల కోసం గతంలోనూ మమత పలుమార్లు పాటలు రాశారు.

## వరద బాధితులకు చిత్రకారుల చేయూత

### జన్మభూమి కోసం కదిలొచ్చిన పంజాబ్ కళాఖండాలు



పంజాబ్ ఇటీవల వరదలతో అతలాకుతల మయింది. దాదాపు నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంది. వేలాది గ్రామాల్లో లక్షలాది ప్రజలు ప్రభావితమయ్యారు. ఈ నేపథ్యంలో ఎంతోమంది ఆపన్నహస్తం అందిస్తున్నారు. నిధులు సేకరించేందుకు దేశవ్యాప్తంగా పలువురు పెయింటర్లు ముందుకు వచ్చారు. దీనికోసం సెప్టెంబర్ 17 నుంచి 25 వరకు చండీగఢ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 170 మంది పెయింటర్లు 470 చిత్రాలను విరాళంగా ఇచ్చారు.

గురుచరణ్ సింగ్, మదన్‌లాల్ వంటి ప్రముఖ కళాకారుల పెయింటింగ్స్ ప్రదర్శనలో ఉన్నాయి. లక్షల విలువ చేసే కళాఖండాలను వారు విరాళంగా ఇచ్చారు. వీటిని అమ్మడం వల్ల వచ్చే డబ్బును పంజాబ్ వరద సహాయ నిధికి అందించనున్నారు. పంజాబ్ లలిత్ కళా అకాడమీ ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తోంది. ఒక్కో పెయింటింగ్ విలువ రూ.1000 నుంచి రూ. లక్షల్లో ఉంటుందని ఎగ్జిబిషన్ నిర్వాహకులు వెల్లడించారు. అకాడమీ అధ్యక్షుడు గుర్దీప్ ధీమాన్ మాట్లాడుతూ.. "ఈ ఎగ్జిబిషన్ నిర్వహించాలని కళాకారుల నుంచి సందేశాలు వచ్చాయి. తమ కళాకృతులను చాలా తక్కువ సమయంలోనే మాకు పంపారు. అలా పంజాబుకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు" అని అన్నారు.

ఇదిలా ఉంటే.. తీవ్రమైన వరదలు సంభవించిన రాష్ట్రంగా ప్రకటించాలని పంజాబ్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వాటిని కేంద్రం ఆమోదించినట్లు వార్తలు వచ్చాయి. ఈ ప్రకృతి విపత్తు వేళ ప్రభావిత ప్రాంతాలకు చెందిన ప్రజలకు పరిహారం కోసం కొత్త చట్టాలను ఆమోదించేందుకు సెప్టెంబర్ 26 నుంచి 29 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించనుంది.

# నేను కాదు బాబోయ్

### ప్రయాగ్‌రాజ్ మిశ్రా గగ్గోలు - రాహుల్ చెప్పిన ఫోన్ నెంబర్ కలకలం




ఓటు చోరీ క్యాంపెయిన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ సామాన్య ప్రజలను కూడా కెలికేస్తున్నట్లు కనిపిస్తోంది. ఫలితం ఎలా ఉన్నా యాధృచ్ఛికమైనా ఆయన మాటలు మాత్రం కలకలం రేపుతున్నాయి.ఓ వ్యక్తికి గురువారం నుంచి ఉన్నట్టుండి విపరీతంగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఆరా తీస్తే.. తన ఫోన్ నంబరును కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో పేర్కొన్నారని తెలిసింది. 'ఓట్లు చోరీ' అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన విషయం తెలి సిందే. ఆ కార్యక్రమం మధ్య ఆయన ఓ వ్యక్తి ఫోన్ నెంబరును ప్రస్తావించారు. ఆ సమావేశం తరువాత నుంచి తనకు విపరీతంగా ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌కు చెందిన మిశ్రా అనే వ్యక్తి పేర్కొన్నారు.

తాను 15 ఏళ్లుగా అదే ఫోన్ నెంబర్ వాడుతున్నానని.. ఇప్పుడు వరుసగా కాల్స్ వస్తుండడంతో తనకు సమస్యగా మారిందని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నట్లుగా ఆసలు తాను ఓటరు తొలగింపు విషయంలో ఎటువంటి దరఖాస్తు చేయలేదని వెల్లడించారు. ప్రెస్ బ్రీఫింగ్‌లో రాహుల్ తన ఫోన్ నెంబర్‌ను పేర్కొన్నారని తెలిసి ఆశ్చర్యపోయానన్నారు. ఎలాంటి దరఖాస్తు పెట్టనప్పుడు తన నెంబర్ వారి దగ్గరకు ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. రాహుల్ గాంధీ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... గుర్తుతెలియని వ్యక్తులు సాఫ్ట్వేర్ ద్వారా వ్యవస్థీకృతంగా వివిధ రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారం ఓటర్ల జాబితాల్లో మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని అలంద్, మహారాష్ట్రలోని రజోరా అసెంబ్లీ నియోజకవర్గాలే దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నవారిని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రక్షిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. బయటి రాష్ట్రాల ఫోన్లను ఉపయోగించి అలంద్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అగంతకులు 6,018 ఓట్లను తొలగిస్తే, అదే విధానంలో మహారాష్ట్రలోని రజోరా నియోజకవర్గంలో 6,850 మంది కొత్త ఓటర్లను చేర్చారని వెల్లడించారు. ఈ క్రమంలో పలువురి పేర్లు, వారికి సంబంధించిన వివరాలను ఆయన మీడియా ముందు వెల్లడించారు. అందులో మిశ్రా నెంబరు ఉండడం తలనొప్పిగా మారింది.

## 474 రాజకీయ పార్టీలపై వేటు

### కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన



దేశవ్యాప్తంగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి చర్యలు చేపట్టింది. నిబంధనలు ఉల్లంఘించిన 474 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ప్రకటించింది. గత ఆరేళ్లలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తొలి దశలో భాగంగా ఈ ఆగస్టులో 334 పార్టీలను రద్దు చేసిన విషయం తెలిసిందే. "రెండో దశలో భాగంగా 474 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను సెప్టెంబర్ 18న జాబితా నుంచి తొలగించాం. గత ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. దీంతో గత రెండు నెలల వ్యవధిలో మొత్తంగా 808 రాజకీయ పార్టీలను రద్దు చేశాం" అని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇప్పటివరకు 2520 గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు ఉండగా, తాజా తొలగింపుతో ఈ సంఖ్య 2046కు తగ్గిందని తెలిపింది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

# ప్రపంచ రక్షణలో భారత్ కీలక భాగస్వామి

*- అమెరికాలోని 'హౌస్ సెలక్ట్ కమిటీ ఆన్ చైనా' అధిపతి ములెనార్*



ప్రపంచ రక్షణలో భారత్ తమకు అత్యవసరమైన భాగస్వామి అని అమెరికాలోని 'హౌస్ సెలక్ట్ కమిటీ ఆన్ చైనా' అధిపతి జాన్ ములెనార్ వెల్లడించారు. తాజాగా అమెరికాలోని భారత దౌత్యవేత్త వినయ్ క్వత్రా ఆయనతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య రక్షణ, వాణిజ్య, సాంకేతికతల మధ్య సహకారాన్ని ఆయన నొక్కిచెప్పారు. గురువారం సెలక్ట్ కమిటీ ఈమేరక ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరుపక్షాలు ప్రాంతీయ భద్రత, ఉత్పత్తి, వాణిజ్యరంగాలపై చర్చించాయని.. అదే సమయంలో చైనానుంచి కీలక తయారీ రంగాన్ని మళ్లించడంపైనా చర్చించుకొన్నాయని వెల్లడించింది. చర్చల సందర్భంగా జాన్ ములెనార్ మాట్లాడుతూ చైనా దౌర్జన్యాలను నేరుగా ఎదుర్కొన్న భారత్ ప్రపంచ భద్రతలో కీలక భాగస్వామి అని అభివర్ణించారు. "భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అమెరికా సెక్యూరిటీ భాగస్వామి. ఇరుదేశాల రక్షణ పరిశ్రమ మధ్య సంబంధాలు కూడా బలోపేతం అవుతున్నాయని చెప్పారు. అది అమెరికన్ ప్రజల రక్షణకు ఎంతో సహాయకారిగా ఉంటుంది.

తన ప్రజలపై చైనా ప్రభావాన్ని నియంత్రించకపోతే ఏమాత్రం స్వతంత్ర దేశంగా మనలేనన్న విషయాన్ని భారత్ ఎప్పుడో గుర్తించింది. భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని క్వత్రా పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఇరుదేశాల బంధం సమష్టి ప్రయోజనాల ఆధారంగా ఇంతకంటే మెరుగుపడుతుంది" అని పేర్కొన్నట్టు ఆ ప్రకటన తెలిపింది. అపఖ్యాతి పొందిన చైనా టెక్నాలజీ, సోషల్ మీడియాను కట్టడి చేయడంలో భారత్ గ్లోబల్ లీడర్ అని వెల్లడించారని పేర్కొంది. గల్వాన్ ఘటన తర్వాత భారత్ టిక్‌టాక్ సహా ఇతర వెబ్‌సైట్లను బ్యాన్ చేయడాన్ని కమిటీ హైలైట్ చేసింది. దీంతోపాటు ఇరుపక్షాలు క్వాడ్ భాగస్వామ్యంపైనా మాట్లాడుకున్నట్టు ఆ ప్రకటన పేర్కొంది.

# అక్టోబర్‌లో మోదీ-ట్రంప్ భేటీ?



ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వచ్చే నెలలో భేటీ కానున్నారు. అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవుతారు. ఈ సదస్సుకు అనుబంధంగా మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరుదేశాల నేతలు మొదటిసారి భేటీ అవనున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ వ్యాఖ్యలు, భారత్‌పై టారిఫ్‌ల వేళ ఈ భేటీ జరుగుతుండడంతో ఇప్పుడు అందరి దృష్టి దానిపైనే ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్టోబర్‌లో మలేసియాకు వచ్చే అవకాశముందని ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఇటీవల పేర్కొన్నారు. ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి హాజరవ్వాలనుకుంటున్నట్టు ట్రంప్ తనకు ఫోన్ చేసి చెప్పారన్నారు. అయితే ఈ భేటీపై ఇంకా అమెరికా, భారత ప్రభుత్వాలు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల మోదీ పుట్టినరోజు సందర్భంగా ట్రంప్ ఆయనకు ఫోన్‌కాల్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఇండియాలో జరగనున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సుకు రావాలని మోదీ ట్రంప్‌ను కోరగా అందుకు ఆయన అంగీకరించినట్టు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

రష్యానుంచి అధికస్థాయిలో చమురు కొనుగోలు కారణాన్ని చూపుతూ ట్రంప్ భారత్‌పై టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఇటీవల హాజరైన ప్రధాని మోదీ అక్కడ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు. ఈ భేటీ అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం కొన్ని గంటల్లోనే తన స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దాని గురించి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తారు. ప్రధాని మోదీ సన్నిహిత స్నేహితుడే అయినా రష్యానుంచి చమురు కొనడంవల్ల అధిక సుంకాలను విధించాల్సి వచ్చిందని స్పష్టంచేశారు.

## శాస్త్రీయ అన్వేషణ దిశగా.. భారత్-అమెరికా అంతరిక్ష భాగస్వామ్యం ముందడుగు



అంతరిక్షరంగ భాగస్వామ్యంలో భారత్, అమెరికా సరికొత్త దిశగా ముందుకెళ్తున్నాయి. అధికారులు, వ్యోమగాములతో వాషింగ్టన్ డీసీలో భారత రాయబార కార్యాలయం తాజాగా ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతరిక్ష రంగంలో రెండు దేశాల మధ్య దశాబ్దాల నుంచీ ఉన్న సహకారం.. చంద్రుడు, అంగారకుడిపై ప్రయోగాలకు ఏవిధంగా మార్గం సుగమం చేసిందో దీనిలో వివరించారు. రెండు దేశాలు కలిసి ఇటీవల చేపట్టిన నైసర్ ఉపగ్రహ, యాక్సియం మిషన్-4 ప్రయోగాల విజయంపై ఇందులో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా మాట్లాడారు. శాస్త్రీయ అన్వేషణ, సాంకేతికాభివృద్ధి, వాణిజ్య సహకారాన్ని ముందుకు తీసుకెళ్లే క్రియాశీల వేదికగా భారత్-అమెరికాల అంతరిక్ష భాగస్వామ్యాన్ని ఆయన అభివర్ణించారు. తక్కువ వ్యయంతో కూడిన అన్వేషణలో భారత అంతరిక్ష రంగం గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందన్నారు. ఇటీవల అంతరిక్ష కేంద్రానికి వెళ్లొచ్చిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, నిక్ హేగ్, బచ్ విల్మోర్, భారత వ్యోమగామి శుభాంశు శుక్లా వర్చువల్‌గా పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు.

**ఐఎస్ఎస్‌కు చేరిన క్యాప్సూల్**

ఇంజిన్ మొరాయించడంతో ఒకరోజు ఆలస్యంగా సరకు రవాణా వ్యోమనౌక గురువారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని చేరకుంది. ఐదు టన్నుల సరకును తీసుకువెళ్లిన క్యాప్సూల్‌ను ఐఎస్ఎస్‌లోని రోబో హస్తంతో అనుసంధానం చేయగలిగారు. ఫ్లోరిడా నుంచి మూడురోజుల క్రితం ఇది బయల్దేరింది. దీనిలో ఆహారంతోపాటు శాస్త్రీయ పరిశోధనలకు కావాల్సిన పరికరాలున్నాయి.

## ఆపరేషన్ సిందూర్‌లో మా స్థావరం ధ్వంసమైంది

**లష్కరే కమాండర్ ఖాసిం అంగీకారిస్తున్నట్టు వీడియో**



ఇన్నాళ్లూ ఆపరేషన్ సిందూర్‌లో తమ పౌరులపై భారత్ దాడి చేసిందని పాక్ చెబుతున్నవన్నీ కట్టుకథలే అని తేలిపోతోంది. తాజాగా లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ ఒకరు ఈవిషయాన్ని అంగీకరించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. దీనిలో లష్కరే కమాండర్ ఖాసిమ్ మాట్లాడుతూ మే 7న ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మురిద్కేలో దెబ్బతిన్న ప్రధాన కార్యాలయాన్ని గతంలో కంటే భారీగా నిర్మిస్తామని పేర్కొన్నాడు. "నేను మురిద్కేలో భారత్ జరిపిన దాడిలో ధ్వంసమైన మర్కజ్ తయ్యిబా శిథిలాలపై ఉన్నాను. దేవుడి దయవల్ల గతంలోకంటే భారీగా దీనిని నిర్మిస్తాం" అని తెలిపాడు. ధ్వంసమైన భవనంలో గతంలో చాలామంది ముజాహిద్దీన్లు (ఉగ్రవాదులు) శిక్షణ పొందినట్టు వెల్లడించాడు. మరో వీడియోలో ఇదే ఉగ్రవాది పాకిస్థానీ యువత ఇక్కడ ఉగ్రశిక్షణ (దౌరా ఇ సుఫా)లో భాగం కావాలని కోరారు. దీనిలో మతం, జిహాదీ శిక్షణ ఇస్తారు. మరో వీడియోలో లష్కరే డిప్యూటీ చీఫ్ సైపుల్లా కసూరీ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం తమకు ఉగ్రస్థావరాల పునర్నిర్మాణానికి నిధులు ఇచ్చినట్లు వెల్లడించారు. భారత్ ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసం చేసిన తొమ్మిది ఉగ్ర శిబిరాల్లో మురిద్కే క్యాంప్ కూడా ఒకటి. పహల్గాంలో 26మంది అమాయకులను ఉగ్రవాదులు హత్య చేయడానికి ప్రతీకారంగా భారత్ ఈ దాడులు చేపట్టింది.

మరోవైపు పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు 2026 ఫిబ్రవరి 5న కశ్మీర్లోని సంఘీభావ దినోత్సవంపై దృష్టి పెట్టినట్టు భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. అప్పటికల్లా మురిద్కేలోని ఉగ్ర కాంప్లెక్సు పునర్నిర్మించి సభ నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ నిర్మించబోయే భవనమే మరోసారి ఉగ్రశిక్షణ, ఆపరేషనల్ ప్లానింగుకు కేంద్రంగా మారనుంది. ఇటీవల జైషే కమాండర్ ఇలియాస్ కశ్మీరీ కూడా ఓ ప్రసంగంలో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజర్ కుటుంబం చిన్నాభిన్నమైందని అంగీకరించిన విషయం తెలిసిందే.

## నిర్ణయం ఆఫ్ఘాన్‌లదే..!

**- ఆ దేశ ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తాం: చైనా**

**- బాగ్రాంలో పాగా వేస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలకు కౌంటర్**



అఫ్ఘానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరాన్ని మళ్లీ స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై తాజాగా చైనా స్పందించింది. బాగ్రాంలో అమెరికా మళ్లీ పాగా వేసే నిర్ణయాన్ని అఫ్గాన్ ప్రజలకు వదిలేయాలని అభిప్రాయపడింది. వారి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని పేర్కొంది. "అఫ్గాన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని చైనా గౌరవిస్తుంది. అఫ్గాన్ భవిష్యత్తు అక్కడి ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచడంవల్ల మద్దతు లభించదు. ప్రాంతీయ స్థిరత్వం కోసం సంబంధిత పక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని ఆశిస్తున్నాం" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు. బ్రిటన్ పర్యటనలో భాగంగా ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అనంతరం మాట్లాడిన డొనాల్డ్ ట్రంప్... అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరంలో మళ్లీ పాగా వేయాలని భావిస్తున్నామని చెప్పారు. ప్రత్యర్థి చైనా అణ్వాయుధ తయారీ కేంద్రాలకు అతి దగ్గరగా ఉంటుందని, కేవలం గంట వ్యవధిలో వెళ్లవచ్చన్నారు. మరోవైపు, అఫ్గాన్‌నుంచి తమ బలగాలను ఉపసంహరించుకున్న వెంటనే తాలిబాన్ ప్రభుత్వంతో చైనా దౌత్య సంబంధాలు ఏర్పరచుకుందని, చమురు వెలికితీత, కాపర్ గని పునరుద్ధరణకు పెట్టుబడులు పెట్టిందని అగ్రరాజ్యం చెబుతోంది.

## డోర్లు మూసుకుపోలేదు!

**- పాక్-సౌదీ రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు**

**- మూడోదేశం చేరకూడదన్న క్లాజ్ లేదన్న పాక్**



సౌదీతో తమ దేశం కుదుర్చుకొన్న రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు చేరే అవకాశం ఉందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు. ఇందుకు గల అవకాశాలను తాము మూసివేయ లేదని పేర్కొన్నారు. అరబ్ దేశాలు కూడా ఈ డీల్‌లో భాగం అవుతాయా..? అని జియో న్యూస్ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. "ముందస్తుగా దీనికి నేనేమీ సమాధానం చెప్పలేను. కానీ, ద్వారాలు మూసుకుపో లేదని కచ్చితంగా చెప్పగలను" అని వెల్లడించారు. పాకి స్థాన్‌కు బలహీనతలు ఉండటంతో.. నాటోవంటి ఏర్పాట్లు ఉండాలని తాను చాలా కాలంగా చెబుతున్నానన్నారు. ముఖ్యంగా ముస్లిం ప్రజలు, దేశాలు ఉన్నచోట సమష్టిగా దేశాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇక తాజాగా సౌదీతో చేసుకొన్న ఒప్పందంలో మూడో దేశం చేరకుండా.. లేదా మరో దేశంతో ఇలాంటి అగ్రిమెంట్ చేసుకోకూడదని ఎటువంటి క్లాజు లేదని ఆసిఫ్ చెప్పారు. ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదన్న నిబంధనేమీ లేదన్నారు. తమకున్న అన్ని సామర్థ్యాలను వినియోగిస్తామని చెప్పారు. తమ దేశం అణ్వాయుధ తనిఖీలకు ఎప్పుడూ సహకరిస్తుందని.. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడదని పేర్కొన్నారు. అయితే ఇది కేవలం రక్షణాత్మక ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. చాలా ఏళ్లుగా తాము సౌదీ సైనికులకు శిక్షణ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దానికి పొడిగింపుగా ఈ ఒప్పందాన్ని అభివర్ణించారు. ఇరు దేశాల్లో దేనిపై దాడి జరిగినా.. సమష్టిగా ఎదుర్కొంటాయని పేర్కొన్నారు. ఇక అఫ్గానిస్థాన్‌ను అమెరికా వీడి వెళ్లిపోయాక ఆ పరిణామాలను తాము అనుభవిస్తున్నామని ఆసిఫ్ వెల్లడించారు.. అఫ్గానిస్థాన్‌ను ప్రత్యర్థి దేశంగా అభివర్ణించారు.

పాకిస్థాన్-సౌదీ అరేబియా మధ్య ఇటీవలే ఓ రక్షణ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం ఇరువురిలో ఏ దేశంపై దాడి జరిగినా రెండింటిపై దాడిగా భావించి ఎదుర్కొంటారు. కొన్ని నెలల క్రితం భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి బదులుగా మన బలగాలు పాక్‌లోని ఉగ్రమూకలను మట్టుపెట్టాయి. దాని తర్వాత రెండు దేశాల మధ్య కొన్నిరోజులపాటు ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఒప్పందం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

చైతన్యరథం

# ఒమన్‌పై భారత్ ఘన విజయం..!

ఆసియా కప్ 2025 టోర్నీలో టీమిండియా దుమ్మురేపుతోంది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. గ్రూప్-ఏలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 21 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో గ్రూప్-ఏ టాపర్‌గా టీమిండియా సగర్వంగా సూపర్-4కు చేరింది.

ఒమన్ బ్యాటర్లలో అమీర్ కలీమ్(46 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 64), హమ్మద్ మిర్జా(33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీలతో రాణించగా.. కెప్టెన్ జతిందర్ సింగ్(33 బంతుల్లో 5 ఫోర్లతో 32) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ తలో వికెట్ తీసారు.

అంతకు ముందు టీమిండియా నిర్ణీత 20 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 188 పరుగులు చేసింది. ఇండియా బ్యాటర్లలో సంజు శాంసన్ 56, అభిషేక్ శర్మ 38, తిలక్ వర్మ 29, అక్షర్ పటేల్ 26 రాణించారు. ఒమన్ బౌలర్లలో అమీర్ కలీం, షా ఫైజల్, జితెన్ రామనంది తలో రెండు వికెట్లు తీశారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. రెండో ఓవర్ మూడో బంతికే భారత్ శుభమన్ గిల్ (5) వికెట్ కోల్పోయింది. గిల్‌ను షా



ఫైజల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. రెండో ఓవర్ లోనే శుభమన్ గిల్ వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ అభిషేక్ శర్మ తన సహజ శైలిలో జోరు కొనసాగించాడు. పవర్ ప్లే (6 ఓవర్లు) ముగిసే సమయానికి అతను 14 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 38 పరుగులు చేశాడు. జితేన్ రామనంది వేసిన 8వ ఓవర్లో టీమిండియాకు వరుస షాక్‌లు తగిలాయి. తొలి బంతికి అభిషేక్ శర్మ వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ కాగా.. మూడో బంతికి హార్దిక్ పాండ్యా (1) రనౌటయ్యాడు. టీమిండియా 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 100 పరుగుల మార్కును చేరింది. 11.2వ ఓవర్‌లో 118 పరుగుల వద్ద టీమిండియా నాలుగో వికెట్ కోల్పోయింది. ఆమిర్ కలీమ్ బౌలింగ్‌లో అక్షర్ పటేల్ (26: 13 బంతులు, 3 ఫోర్లు, ఒక సిక్స్) ఔటయ్యాడు. అక్షర్ అంతకముందు బంతికి సిక్సర్ బాది జోరు మీదున్నట్లు కనిపించినా తరువాతి బంతికే అవుటయ్యాడు. సంజూ శాంసన్‌కు జతగా శివమ్ దూబే క్రీజ్ లోకి వచ్చాడు. 13.2వ ఓవర్లకు టీమిండియా 130 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కలీమ్ బౌలింగ్‌లో శివమ్ దూబే (5: 8 బంతులు) ఔటయ్యాడు. తరువాత సంజూ శాంసన్ 41 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. రామనంది బౌలింగ్‌లో బౌండరీతో ఈ మార్కును చేరుకున్నాడు. 56 పరుగులు (45 బంతులు, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చేసిన సంజు.. షా ఫైజల్ వేసిన 18 ఓవర్‌లో నాలుగో బంతికి ఆర్యన్ బిస్త్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తరువాత జిక్రియా ఇస్లావమ్ వేసిన 19 ఓవర్‌లో తిలక్ వర్మ 29 (18 బంతులు, ఒక ఫోర్, 3 సిక్సులు) ఔటయ్యాడు. ఆఖరి ఓవర్‌లో అర్షదీప్ సింగ్ (1) రనౌటయ్యాడు. చివరి బంతికి హర్షిత్ రాణా (13 నాటౌట్: 8 బంతులు, ఒక సిక్స్) సిక్స్ బాదటంతో టీమిండియా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది.

# ధృవ్ జురెల్, దేవదత్ పడిక్కల్ భారీ శతకాలు

**ఆస్ట్రేలియా-ఏతో తొలి అనధికార టెస్ట్ డ్రా**

భారత యువ బ్యాటర్లు ధృవ్ జురెల్, దేవదత్ పడిక్కల్ భారీ శతకాలతో మెరవటంతో ఆస్ట్రేలియా ఏ జట్టుతో లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా జరిగిన తొలి అనధికారిక నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో నాలుగో రోజైన శుక్రవారం నిర్ణీత సమయం కంటే ముందుగానే మ్యాచ్‌ను ముగించారు.

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్.. 6 వికెట్ల నష్టానికి 532 పరుగులు చేసి ఇన్నింగ్సును డిక్లేర్ చేసింది. ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (109), వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ (123 నాటౌట్) సెంచరీలతో కదంతొక్కగా.. క్యాంప్బెల్ కెల్లావే (88), కూపర్ కన్నోల్లీ (70), లియమ్ స్కాట్ (81) కూడా రాణించారు. భారత బౌలర్లలో హర్ష్ దూబే 3, గుర్నూర్‌జీత్ బ్రార్ 2, ఖలీల్ అహ్మద్ ఓ వికెట్ తీశారు.

అనంతరం బరిలోకి దిగిన భారత్ దీటుగా జవాబిచ్చింది. ఆధిక్యం సాధించే అవకాశం ఉన్నా.. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఒక్క పరుగు తక్కువతోనే ఇన్నింగ్సును డిక్లేర్ చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్ లో 7 వికెట్లు కోల్పోయి 531 పరుగులు చేసింది.

ధృవ్ జురెల్ (197 బంతుల్లో 140: 13 ఫోర్లు, 4 సిక్సర్లు), దేవత్ పడిక్కల్ (281 బంతుల్లో 150: 14 ఫోర్లు, సిక్స్) అద్భుత శతకాలతో చెలరేగగా.. సాయి సుదర్శన్ (73), ఎన్ జగదీశన్ (64) అర్థ సెంచరీలతో రాణించారు. భారత ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8) ఒక్కడే విఫలమయ్యాడు.

ఒక్క పరుగు ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. సామ్ కొన్‌స్టాస్ 27, క్యాంప్బెల్ కెల్లావే 24 పరుగులతో అజేయంగా ఉన్నారు. ఈ దశలో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఇరు జట్ల మధ్య రెండో అనధికార టెస్ట్ ఇదే వేదికగా సెప్టెంబర్ 23-26 మధ్య జరుగనుంది.

కాగా, ఆస్ట్రేలియా-ఏ జట్టు రెండు అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు, 3 అనధికారిక వన్డేల ఆడేందుకు భారత్‌లో పర్యటిస్తుంది. వన్డేలు సెప్టెంబర్ 30, అక్టోబర్ 3, 5 తేదీల్లో కాన్పూర్ వేదికగా జరుగనున్నాయి.







# ఆస్ట్రేలియాకు ఎదురుదెబ్బ..

## యాషెస్ సిరీస్‌కు కమిన్స్ దూరం?

ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగలనుంది. ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఈ ప్రతిష్ఠాత్మక టెస్ట్ సిరీస్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. కాగా వెన్నుముక దిగువ భాగంలో నొప్పితో కమిన్స్ కొన్నాళ్లుగా ఆటకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. జూన్- జూలైలో ఆసీస్ జట్టు వెస్టిండీస్ పర్యటనకు వెళ్లగా కమిన్స్ మాత్రం ఫిట్నెస్ సమస్యలతో స్వదేశంలోనే ఉండిపోయాడు. అప్పటి నుంచి ఇంత వరకు మళ్లీ మైదానంలో దిగలేదు. అంతేకాదు.. అక్టోబరులో న్యూజిలాండ్, టీమిండియాలతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా కమిన్స్ అందుబాటులో ఉండటం లేదు. ఇంగ్లాండ్‌తో యాషెస్ టెస్టు సిరీస్‌కు ముందు తగినంత విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతో మేనేజ్మెంట్.. తమ కెప్టెన్ విషయంలో ఈ మేరకు జాగ్రత్తలు తీసుకుంది. అయితే, తాను యాషెస్ కూడా ఆడతానో లేదో అంటూ కమిన్స్ తాజాగా బాంబు పేల్చాడు. ఆ విషయమై కమిన్స్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నాకు ఎలాంటి ప్రణాళికలు లేవు. జిమ్‌లో వర్కౌట్లు చేస్తున్నా. అయితే, గాయం నుంచి వంద శాతం కోలుకున్నానని చెప్పలేను. యాషెస్ నుంచి మళ్లీ మైదానంలో దిగాలనే ఆశిస్తున్నా. అయితే, ఈ విషయంపై ఇప్పుడే స్పష్టత మాత్రం ఇవ్వలేను. యాషెస్‌లో ఆడాలని బలంగా అనుకుంటున్నా. ఒకవేళ ఆడినా మొత్తం ఐదు టెస్టులు ఆడతానో లేదో చెప్పడం కష్టం. ముున్ముందు ఏం జరుగుతుందో వేచి చూద్దామని తెలిపాడు. కాగా ఈసారి ఆస్ట్రేలియా స్వదేశంలో ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్ ఆడనుంది. ఇరుజట్ల మధ్య నవంబరు 21- జనవరి 8 వరకు ఐదు టెస్టుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది.

# ఆసియా కప్..

# నేటినుంచి సూపర్-4 సమరం




ఆసియా కప్-2025 టోర్నమెంట్ కీలకమైన సూపర్-4 దశకు చేరుకుంది. మొత్తంగా ఎనిమిది జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో పాల్గొంటున్న ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించి తొలి దశ మ్యాచ్‌లు నిర్వహించారు. రెండు గ్రూపుల్లో టాప్ 2 లో నిలిచిన నాలుగు జట్లు సూపర్-4 దశకు చేరుకున్నాయి. లీగ్ స్టేజ్‌లో గ్రూప్-ఎ నుంచి భారత్, పాకిస్తాన్, యూఏఈ, ఒమన్.. గ్రూప్-బి నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, హాంకాంగ్ పోటీ పడ్డాయి. వీటిలో భారత్, పాకిస్తాన్.. శ్రీలంక, బంగ్లాదేశ్ సూపర్-4 దశకు చేరుకోగా.. యూఏఈ, ఒమన్, అఫ్ఘానిస్థాన్, హాంకాంగ్ ఎలిమినేట్ ఇంటిదారి పట్టాయి. సూపర్-4లో రౌండ్ రాబిన్ తరహాలో మ్యాచులు జరుగుతాయి. తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్‌కు చేరతాయి.గెలిచిన జట్టుకు రెండు పాయింట్లు వస్తాయి. ఫలితం తేలకపోతే చెరొక పాయింట్ వస్తుంది. ఓటమికి ఎలాంటి పాయింట్ ఉండదు. పాయింట్లపరంగా సమమైతే.. నెట్ రన్రేట్ ఆధారంగా ఫైనలిస్టులను ఖరారు చేస్తారు. సెప్టెంబర్ 28న టైటిల్ పోరు జరగనుంది.

***సూపర్-4 షెడ్యూల్***

మ్యాచ్ 1: సెప్టెంబరు 20- శనివారం- శ్రీలంక వర్సెస్ బంగ్లాదేశ్- దుబాయ్

మ్యాచ్ 2: సెప్టెంబరు 21- ఆదివారం- భారత్ వర్సెస్ పాకిస్తాన్- దుబాయ్

మ్యాచ్ 3: సెప్టెంబరు 23- మంగళవారం- పాకిస్తాన్ వర్సెస్ శ్రీలంక- అబుదాబి

మ్యాచ్ 4: సెప్టెంబరు 24- బుధవారం- భారత్ వర్సెస్ బంగ్లాదేశ్- దుబాయ్

మ్యాచ్ 5: సెప్టెంబరు 25- గురువారం- పాకిస్తాన్ వర్సెస్ బంగ్లాదేశ్- దుబాయ్

మ్యాచ్ 6: సెప్టెంబరు 26- శుక్రవారం- భారత్ వర్సెస్ శ్రీలంక- దుబాయ్

సూపర్ 4 మ్యాచులన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు మొదలవుతాయి.

# ఆసీస్ జట్టుకు జరిమానా

తాజాగా భారత మహిళల జట్టుతో జరిగిన వన్డే మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ఆస్ట్రేలియా మహిళా జట్టుకు మరో షాక్ తగిలింది. పుండు మీద కారం చల్లినట్లుగా ఆ జట్టు మ్యాచ్ ఫీజ్‌లో 10 శాతం కోత విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఆసీస్ జట్టు మొత్తానికి ఈ జరిమానా వర్తిస్తుంది. ఆ మ్యాచ్‌లో ఆసీస్ బౌలర్లు నిర్దేశిత సమయంలోపు 2 ఓవర్లు వెనుకపడి ఉన్నారు. ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఆర్టికల్ 2.22 నిబంధన ప్రకారం నిర్దేశిత సమయంలోగా వెనుకపడిన ప్రతి ఓవర్‌కు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజ్‌లో 5 శాతం కోత విధిస్తారు. ఈ లెక్కన ఆసీస్ ప్లేయర్లకు రెండు ఓవర్లకు గాను 10 శాతం జరిమానాగా విధించారు. గత బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు ఆస్ట్రేలియాను చిత్తుచేసి 102 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్... 49.5 ఓవర్లలో 292 పరుగులు చేసి ఆలౌటైంది. ఓపెనర్ స్మృతి మంధన (91 బంతుల్లో 117: 14 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడింది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియాలు 1-1తో సమంగా ఉన్నాయి. నిర్ణయాత్మక మూడో వన్డే న్యూఢిల్లీ వేదికగా ఈ నెల 20న జరుగనుంది.



చైతన్య రథం
సినిమా
శనివారం 20 సెప్టెంబర్ 2025


# కెరీరే.. ముఖ్యమనుకున్నా



నటన కోసమే ఇంత వయసొచ్చినా పెళ్లి చేసుకోలేదని అంటోంది అమీషా పటేల్. చాలా పెళ్లి ప్రతిపాదనలు వచ్చినా.. అన్నింటినీ నటన కోసమే వదులుకున్నాని చెబుతోంది. 'బద్రి', 'నాని', 'నరసింహుడు' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన అమీషా పటేల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి మాట్లాడారు. 50 ఏళ్లు వచ్చినా ఇంకా ఒంటరిగా ఉండడానికి కారణాన్ని వెల్లడించారు. "ఇప్పటికీ ఎన్నో వివాహ ప్రతిపాదనలు వస్తున్నాయి. నా వయసులో సగం వయసున్నవారూ నన్ను పెళ్లి చేసుకుంటామని అంటున్నారు.కానీ, వారంతా పెళ్లి అనంతరం నటనకు దూరంగా ఉండాలన్న నిబంధన పెడుతున్నారు. అందుకే తిరస్కరించాను. మనల్ని ప్రేమించేవారు మనం కెరీర్ లోనూ ముందుకువెళ్లాలని కోరుకోవాలి. నేను కెరీర్ కోసం చాలాకోల్పోయాను. గతంలో ఒకరిని ప్రేమించా. కానీ, అతడు నేను నటించడానికి వీల్లేదని చెప్పారు. ప్రేమకంటే కెరీర్ గొప్పదని వదులుకున్నా. నేనేం పెళ్లికి వ్యతిరేకం కాదు. దానికి తగిన వ్యక్తి నాకు కనిపించినప్పుడు పెళ్లి చేసుకుంటాను" అని అమీషా తెలిపారు. ఇక సినిమాల విషయానికొస్తే.. అమీషా ఐదేళ్ల విరామం తర్వాత 'గదర్ 2' లో నటించారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా రూ.680 కోట్లకు పైగా వసూలు చేసింది. గతేడాది 'తౌబా తేరా జల్వా' అనేచిత్రంలో కనిపించా రు. అయితే దీని తర్వాత ఆమె మరో ప్రాజెక్టును అంగీకరించక పోవడం గమనార్హం.

# ఎన్టీఆర్‌కు స్వల్పగాయాలు



హీరో ఎన్టీఆర్‌కు షూటింగ్‌లో స్వల్ప గాయమైంది. యాడ్ షూటింగ్‌లోని యాక్షన్ సీన్‌లో కిందపడిపోవడంతో గాయపడ్డారు. వెంటనే వ్యక్తిగత సిబ్బంది సమీపంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ టీమ్ ప్రకటన విడుదల చేసింది. వైద్యుల సలహా మేరకు.. పూర్తిగా కోలుకోవడానికి ఎన్టీఆర్ రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోనున్నారని తెలిపింది. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు తెలిపింది. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. ఇటీవల 'వార్2'తో ఎన్టీఆర్ ప్రేక్షకులను పలకరించిన సంగతి తెలిసిందే.

# హంగ్రీ చీతా.. ట్రైలర్ రేపేనట



ఈసారి దీపావళి మోత దసరాకంటే ముందే వినిపించాలని ఫిక్స్ అయినట్టున్నారు పవన్‌కల్యాణ్. ఇక్కడ చేతిలో గన్నులు చూస్తుంటే అదే ఖాయమనిపిస్తోంది. 'నెత్తురు మరిగిన హంగ్రీ చీతా.... శత్రువును ఎంచితే మొదలు వేట... చూపుగాని విసిరితే ఓర కంట... డెత్ కోట కన్ఫమ్ అంట..."' అంటూ తెరపై 'ఓజీ' విజృంభణ ఎలా ఉంటుందో ఇప్పటికే పాటతో చెప్పకనే చెప్పిన చిత్రబృందం, ఇక ట్రైలర్‌తో అభిమానుల్ని మరింతగా ఊరించేందుకు సిద్ధమైంది. ఈనెల 21న 'ఓజీ' ట్రైలర్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా... సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ముఖ్య భూమిక పోషించారు. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ఈ నెల 25న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమాలు ఊపందుకొన్నాయి. అందులో భాగంగానే ట్రైలర్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్ పోషించిన సత్య దాదా పాత్ర లుక్‌ని విడుదల చేశారు. ఓజాస్ గంభీర పాత్రలో పవన్ కల్యాణ్ తెరపై సందడి చేయనున్నారు.

# సీక్వెల్స్‌పై దృష్టిపెట్టిన తేజ సజ్జా



తాజాగా 'మిరాయ్'తో సూపర్ హిట్ అందుకొన్న తేజ సజ్జ మరోసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన 'మిరాయ్' సక్సెస్ కావడంతో ఆయన అప్‌కమింగ్ సినిమాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా తేజ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన అప్‌కమింగ్ సినిమాల గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. ప్రస్తుతం 'మిరాయ్' హవా కనిపిస్తోంది. ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని దర్శకుడు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో విలన్‌గా రానా దగ్గుబాటి కనిపించనున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. వాటి గురించి తేజ మాట్లాడారు. "దీని సీక్వెల్ 'మిరాయ్: జైత్రయ' పేరుతో రానుంది. మేం ఇంకా రానాకు స్క్రిప్ట్ చెప్పలేదు. కానీ, దీని సీక్వెల్లో మిమ్మల్ని ఆశ్చర్యపరిచే చాలా ఐడియాలు ఉన్నాయి. అది 'మిరాయ్'ని మించి ఉంటుంది. ప్రేక్షకులు కూడా మొదటి భాగాన్ని మించి ఆదరిస్తారనే నమ్ముతున్నాం. ఆ సీక్వెల్ ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది" అని అన్నారు. ఇక- గతేడాది విడుదలై విజువల్ వండర్‌గా నిలిచిన 'హనుమాన్'కు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానుంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్టు తేజ తెలిపారు.

ప్రశాంత్ వర్మ, రిషబ్‌శెట్టి ఇద్దరూ వారి ప్రాజెక్టుతో బిజీగా ఉన్నారని.. వాళ్ల చేతిలోని సినిమాలు అయిపోయాక 'జై హనుమాన్' పనులు షురూ అవుతాయన్నారు. అలాగే -తేజ సజ్జ హీరోగా 2021లో విడుదలై ఆదరణ సొంతం చేసుకున్న చిత్రం జాంబిరెడ్డి. దీని సీక్వెల్‌పై సినీప్రియులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. వారి అంచనాలకు తగినట్లుగానే సీక్వెల్ ఉంటుందని తేజ తెలిపారు. కామెడీతోపాటు యాక్షన్ సన్నివేశాలు ఉంటాయన్నారు. దీని విజువల్స్ ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాయని నమ్మకం వ్యక్తం చేశారు.

# కాంతారా-1 ట్రైలర్‌కు రెడీ



ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా చిత్రాల్లో.. రిషబ్‌శెట్టి హీరోగా స్వీయ దర్శకత్వంలో రానున్న 'కాంతార 1' ఒకటి. కొన్నాళ్ల కితం వచ్చిన కాంతార ది లెజెండ్‌కి ప్రీక్వెల్‌గా వస్తున్న ఈసినిమా ట్రైలర్ ఎప్పుడెప్పుడా? అని అభిమానులు ఎదురు చూస్తుండగా ఫైనల్‌గా మేకర్స్ బిగ్ న్యూస్‌ని లేటెస్ట్‌గా రివీల్ చేశారు. కాంతార-1 థియేట్రికల్ ట్రైలర్‌ని సెప్టెంబర్ 22న మధ్యాహ్నం 12 గంటల 45నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్సమెంట్‌ని ఇచ్చేసారు. దీంతో అభిమానులు.. ఈసారి మేకర్స్ ఎలాంటి మాయాజాలం చేస్తారోనని ఎదురు చూస్తున్నారు. చిత్రాన్ని ఐమ్యాక్స్ వెర్షన్‌లో కూడా రిలీజ్ చేస్తుండగా.. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 2న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది కాంతార-1.

# ఓటీటీలోకి వచ్చేసిన మహావతార్..



ఇండియన్ సినిమా ఈ ఏడాదిలో డెలివర్ చేసిన హిస్టారికల్ సెన్సేషనల్ హిట్ చిత్రాల్లో "మహావతార్ నరసింహ" ఒకటి. దర్శకుడు అశ్విన్ కుమార్ తెరకెక్కించిన యానిమేషన్ చిత్రం.. ఎలాంటి పాన్ ఇండియా స్టార్స్ ప్రెజెన్స్ లేకున్నా సాలిడ్ ఎమోషన్స్ సహా గ్రాండ్ విజువల్స్‌తో వచ్చి ఫ్యామిలీ ఆడియెన్స్‌ని థియేటర్స్‌కి రప్పించింది. రూ.300 కోట్లకి పైగా వసూళ్లు సొంతం చేసుకున్న సినిమా ఎట్టకేలకి ఓటిటిలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. ఈ సినిమాని దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. నేటినుంచి సినిమా తెలుగు సహా ఇతర పాన్ ఇండియా భాషల్లో అందుబాటులోకి వచ్చేసింది. మరి ఓటిటిలో ఈ సినిమా ఎలాంటి సంచలనం సెట్ చేస్తుందో చూడాల్సిందే.

# 'కర్మనుంచి తప్పించుకోలేరు'

'కల్కి 2'నుంచి దీపిక ఔట్.. ఇప్పుడిదే ఇండస్ట్రీ హాట్ టాపిక్. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా దీపికా పదుకొనెను ఉద్దేశించే పోస్టులు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో 'కల్కి 2898 ఏడీ' దర్శకుడు నాగ్‌అశ్విన్ షేర్ చేసిన పోస్ట్.. దానికి ఆయన పెట్టిన క్యాప్షన్ చర్చనీయాంశంగా మారాయి. 'కల్కి 2898 ఏడీ'లో కృష్ణుడి ఎంట్రీ సీన్‌ను నాగ్ అశ్విన్ షేర్ చేశారు. అందులో 'కర్మను ఎవరూ తప్పించుకోలేరు.. నీ కర్మను నువ్వు అనుభవించాల్సిందే..' అని అశ్వత్థామకు కృష్ణుడు చెప్పే డైలాగుంది. దీన్ని షేర్ చేస్తూ ఆయన ఓ ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. "జరిగిన దాన్ని ఎవరూ మార్చలేరు. కానీ, తర్వాత ఏం జరగాలో మీరు ఎంచుకోవచ్చు" అని రాసుకొచ్చారు. దీంతో టాలెంటెడ్ దర్శకుడు దీపికను ఉద్దేశించే పోస్ట్ పెట్టారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం దీపికా ప్రాజెక్ట్‌లో భాగం కాకపోవడంపై రకరకాల



కామెంట్స్ వినిపిస్తున్నాయి. పారితోషికం కారణంగానే ఆమెను తప్పించినట్టు వార్తలు వస్తున్నాయి. దీనిపై సోషల్ మీడియాలో చిన్న యుద్ధమే జరుగుతోంది. దీపికను సపోర్ట్ చేస్తూ అభిమానులు వరుస పోస్టులు పెడుతుండగా.. ప్రభాస్ అభిమానులు వారిని విమర్శిస్తూ రిప్లైలు ఇస్తున్నారు. మొత్తం వ్యవహారంపై దీపిక స్పందన కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పుడు 'కల్కి' సీక్వెల్లో ఆమె స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. 'కల్కి'లో దీపిక సుమతిగా నటించింది. రెండో భాగంలోనూ ఆమె పాత్రకు మంచి ప్రాధాన్యముంది. ఈ పాత్రకు ఏ హీరోయిన్ న్యాయం చేయగలదని చర్చించుకుంటున్నారు.